# చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నవంబర్ 3న ఎన్‌బీడీఏ సమావేశం జరగబోతుందని ఎజెండా కూడా విడుదల అయింది. గోదావరి కావేరి లింక్‌ను ఈ ఎజెండాలో చేర్చుతూ అన్ని రాష్ట్రాలకు పంపించారు. ఈ విషయంలో కుట్ర జరుగుతుందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7వ తారీఖున చంద్రబాబు నాయుడు లేఖ రాశారని.. వారంలో ఎజెండాలో చేర-చ్చుతూ అన్ని రాష్ట్రాలకు ఇన్ఫర్మేషన్ వచ్చిందన్నారు. చంద్రబాబు లేఖ రాయగానే కేంద్రం మీటింగ్ ఏర్పాటు చేసింది. గోదావరిని చంద్రబాబు నాయుడు కబళిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ లేవనెత్తే వరకు మన రాష్ట్ర నేతలకు సోయి లేదని మండిపడ్డారు. గతంలో చంద్రబాబు ప్లాన్‌లను అడ్డుకున్నామని, ఇప్పుడు గోదావరి కావేరి లింక్ పేరుతో గోదావరి జలాల్ని కబళించే కుట్ర చేస్తున్నారన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ పదేపదే చెప్పేవారు. ఆయన చెప్పినట్లే ఇప్పుడు జరుగుతుంది. రేవంత్ రెడ్డి గురు దక్షణ అనుకొని వదిలి పెడుతున్నాడా? అంటూ నిలదీశారు. రేవంత్‌ను ప్రజలు తరతరాల వరకు క్షమించరన్నారు. హక్కులు ఉన్నపుడే గోదావరి కృష్ణా జలాలను వదిలి వేశారు. ఇప్పుడు శాశ్వతంగా నీళ్లు రాకుండా చేస్తున్నారని మండిపడ్డారు. నీళ్ళు పైసలు పెట్టీ కొనలేమని మొన్న సీఎం అన్న మాటలను గుర్తు చేశారు. అంతటి ప్రాధాన్యత ఉన్న నీళ్లను ఎందుకు వదులు కుంటున్నారని ప్రశ్నించారు. ఎల్‌నీనో వస్తుందని తెలిసినప్పుడు దేవాదుల నీళ్ళని ఎందుకు వదిలి పెట్టావు? నువ్వు వదిలి పెడితే చంద్రబాబు నాయుడు ఒడిసి పట్టుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వర్షపాతం కూడా మన కంటే తక్కువ నమోదు అయిందని, అయినా అక్కడ ఎలాంటి క్రాప్ హాలిడేలు ఇవ్వలేదని మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. "మన నీళ్లను కిందకు వదిలినందుకు ముందు క్షమాపణ చెప్పు. చంద్రబాబు నాయుడు లేఖ తెలంగాణ హక్కులకు మరణ శాసనం లాంటిది. బొల్లేపల్లిలో ప్రాజెక్ట్ కట్టుకుంటామని చంద్రబాబు అంటున్నారు. బొల్లేపల్లిలో కట్టుకుంటే తెలంగాణకు ఏం లాభం? సమ్మక్క సాగర్‌లో ప్రాజెక్ట్ కడితే తెలంగాణకి న్యాయం జరుగుతుంది. అసలు ఇంటర్ లింకింగ్ నుంచి సమ్మక్క సాగర్‌ను ఎందుకు తీసి వే-స్తున్నారు? బొల్లేపల్లి ద్వారా ఇంటర్ లింకింగ్ ఎందుకు చేస్తున్నారు? బొల్లేపల్లి ఏపీ కంట్రోల్ ఉంటుంది. బీఆర్ఎస్ ఉన్నప్పుడు సమ్మక్క సాగర్‌కు సగం అనుమతులు తెచ్చుకున్నాం. ఇప్పుడు ఈ ప్రభుత్వం వల్ల సమ్మక్క సాగర్ డీపీఆర్ కూడా వెనక్కి వచ్చింది. చంద్రబాబు నాయుడు ఈ లేఖలో విన్ విన్ పరిస్థితి ఉంది అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే లాభం జరిగితే విన్ విన్ సిచువేషన్ అవుతుందా? ప్రపంచంలో నీళ్ల కోసం యుద్ధాలు జరుగుతాయి అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వచ్చే నీటి వాటాలను ఎందుకు వదులుకుంటున్నారు. చంద్రబాబు నాయుడుకి 16 మంది ఎంపీలు ఉన్నారు కాబట్టి కేంద్రం వింటుందా? తెలంగాణలో ఉన్న 17 మంది ఎంపీలు ఏం చేస్తున్నారు. కేంద్రం తెలంగాణకి ఎందుకు అన్యాయం చేస్తుంది. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఏం చేస్తున్నారు. కేంద్రానికి తెలంగాణ అంటే ఎందుకు చిన్న చూపు. కేంద్రం తెలంగాణ గొంతు పిసుకుతాం అంటే ఊరుకోం. గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే ఒప్పుకోం. మరో నీటి ఉద్యమం మొదలు పెడతాం. పార్టీలో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తాం." అని హరీష్ రావు స్పష్టం చేశారు.

## నాకూ నోటీసొచ్చింది..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియలో తీవ్ర లోపాలు ఉన్నాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ విధానంలో పారదర్శకత లోపించిందని, స్వయంగా తనకు కూడా నోటీసు వచ్చిందని ఆయన తెలిపారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఎన్నికల వ్యవస్థలో అవలంబించాల్సిన ప్రాథమిక నిబంధనలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. 'ఎవరైనా వ్యక్తి మరణిస్తే ఓటు తొలగించాలి.. వేరే ప్రాంతానికి బదిలీ అయితే ఓటు మార్పిడి జరగాలి. కానీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి నచ్చని ఓట్లను ఏకపక్షంగా తొలిగించే కుట్ర జరుగుతోంది' అని విమర్శించారు.

**ఎలక్షన్ కమిషన్ స్వతంత్రతపై ప్రశ్నలు..**

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మహేష్ కుమార్ గౌడ్, ఇన్నాళ్లూ ఈడీ , సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగించిన బీజేపీ, ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆరోపించారు. ముఖ్యంగా కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో తెచ్చిన మార్పులను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. సీఈసీ ఎంపిక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ని ఎందుకు తొలగించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర వ్యవస్థల విధుల్లో కేంద్రం జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు అని హెచ్చరించారు.

# పిల్లలకు ఇంటర్నెట్ ప్రాథమిక హక్కు

**ఢిల్లీ :** ఇంటర్నెట్‌ను యాక్సెస్ చేయడం, ఉపయోగించడం అనేది ప్రతి వ్యక్తికీ ప్రాథమిక హక్కని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 19(1)(ఎ) కింద పెద్దలతో పాటు పిల్లలకు కూడా అది ప్రాథమిక హక్కేనని స్పష్టం చేసింది. పిల్లలకు ఇంటర్నెట్ పూర్తిగా నిరాకరించడం అసంబద్ధమని కోర్టు తేల్చిచెప్పింది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, ఇతర ఆన్‌లైన్ సేవల నుంచి పిల్లలపై లైంగిక వేధింపులు, దుర్వినియోగ పదార్థాలను గుర్తించి తొలగించే యంత్రాంగాన్ని పటిష్టం చేయాలని ఆదేశాలు జారీ చేసిన సందర్భంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

**పిల్లలను ఇంటర్నెట్‌కు పూర్తిగా దూరం చేయలేం:**

పిల్లల భద్రత కోసం వారిని ఇంటర్నెట్, సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉంచాలా? అనే అంశాన్ని ధర్మాసనం పరిశీలించింది. ఇంటర్నెట్‌లో పిల్లలకు హాని కలిగించే కంటెంట్ ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించింది. అయితే, ఆన్‌లైన్ వేదికలు హానికరమైన కంటెంట్‌ను గుర్తించి తొలగించడంలో విఫలమవుతున్నాయనే కారణంతో పిల్లలను ఇంటర్నెట్‌కు దూరం చేయడం సరైన పరిష్కారం కాదని అభిప్రాయపడింది. ఇంటర్నెట్ వినియోగాన్ని నిషేధించినంత మాత్రాన పిల్లలు దాన్ని ఉపయోగించడం ఆపరని కోర్టు పేర్కొంది. వారు నియంత్రణ లేని ఇతర వెబ్‌సైట్లు, ప్లాట్‌ఫామ్‌లకు వెళ్లే ప్రమాదం ఉందని తెలిపింది. అలాంటి వేదికలు మరింత ప్రమాదకరంగా మారవచ్చని హెచ్చరించింది. ఆన్‌లైన్‌లో ఎవరైనా పిల్లలను ప్రలోభపెట్టినా, బెదిరించినా.. ఇంటర్నెట్ వాడినందుకు తల్లిదండ్రులు మందలిస్తారనే భయంతో వారు ఆ విషయాన్ని చెప్పకుండా ఉండే ప్రమాదం ఉందని పేర్కొంది. పిల్లల ఇంటర్నెట్ వినియోగంపై ఎలాంటి మినహాయింపులు లేకుండా నిషేధం విధించడం సరైన విధానం కాదని స్పష్టం చేసింది.

**మారుమూల ప్రాంత పిల్లలకు ఇంటర్నెటే ప్రధాన ఆధారం**

ఆలోచనలు, సృజనాత్మకత, సమాచారాన్ని పంచుకునేందుకు ఇంటర్నెట్ కీలక వేదికగా మారిందని కోర్టు తెలిపింది. ముఖ్యంగా మా-రుమూల ప్రాంతాల్లో నివసించే చాలా మంది పిల్లలకు చదువు, సమాచారం పొందడానికి ఇంటర్నెట్ ఒక్కటే ప్రధాన మార్గంగా ఉంటోందని వివరించింది. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు తమలాంటి ఇతరులతో పరిచయాలు పెంచుకోవడానికి, స్నేహాన్ని పొందడానికి కూడా ఇది ఉపయోగపడుతోందని పేర్కొంది. 2020లో అనురాధ భాసిన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఇంటర్నెట్ ద్వారా భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకోవడం, వ్యాపారం నిర్వహించడం రాజ్యాంగ పరిరక్షణ పొందే హక్కులని సుప్రీంకోర్టు గతంలో గుర్తించిన విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. అలాగే, 2025లో ప్రజ్ఞా ప్రసూన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో డిజిటల్ సేవలను పొందే హక్కును ఆర్టికల్ 21 కింద ప్రాథమిక హక్కుగా గుర్తించిన అంశాన్ని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇంటర్నెట్ వినియోగ హక్కు పిల్లలకు కూడా వర్తిస్తుందని స్పష్టం చేసింది.

**ప్రత్యేక భద్రతా చర్యలు**

పిల్లలను ఇంటర్నెట్‌కు పూర్తిగా దూరం చేయకూడదన్నంత మాత్రాన ఎలాంటి ఆంక్షలు ఉండకూడదని అర్థం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. వారి వయసుకు తగిన కంటెంట్‌ను మాత్రమే అందుబాటులో ఉంచేందుకు, ఆన్‌లైన్ భద్రతను పెంచేందుకు తగిన రక్షణ చర్యలు అవసరమని పేర్కొంది. ఈ క్రమంలో పిల్లలు సోషల్ మీడియా వినియోగించే సమ-యంలో తల్లిదండ్రుల అనుమతి, మార్గదర్శకత్వం, పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. పిల్లల ఖాతాలను మొదటి నుంచే ప్రైవేట్‌గా ఉంచడం, తెలియని పెద్దల నుంచి వచ్చే సందేశాలు, పరిచయాలను నియంత్రించడం, పిల్లలకు కనిపించే ప్రకటనలు, కంటెంట్‌పై పర్యవేక్షణ వంటి చర్యలను పరిశీలించాలని తెలిపింది. ముఖ్యంగా టీనేజ్‌కు ముందు వయసులో ఉన్న పిల్లల కోసం ఇలాంటి రక్షణ చర్యలను అమలు చేయవచ్చని పేర్కొంది. తల్లిదండ్రుల అనుమతిని ధ్రువీకరించేందుకు సహేతుకమైన, పరిమితమైన విధానాలను రూపొందించాలని సూచించింది. ఈ చర్యలను ఎలా అమలు చేయాలనే అంశాన్ని కేంద్ర ప్రభుత్వానికి వదిలివేసింది. అయితే పెద్దలకు మాత్రమే ఉద్దేశించిన వెబ్‌సైట్లు వంటి పిల్లలకు సహజంగానే హాని కలిగించే నిర్దిష్ట కంటెంట్ లేదా సేవలకు వారి ప్రవేశాన్ని కేంద్ర ప్రభుత్వం నియంత్రించవచ్చని కూడా స్పష్టం చేసింది.

**ఆ కంటెంట్ తొలగింపునకు ఆదేశాలు**

పిల్లలపై లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు సుప్రీంకోర్టు పలు ఆదేశాలు జారీ చేసింది. సోషల్ మీడియా సహా వివిధ ఆన్‌లైన్ వేదికల్లో ఇలాంటి కంటెంట్‌ను గుర్తించడానికి, తొలగింపును సులభతరం చేయడానికి సమగ్ర జాతీయ డేటాబేస్‌ను రూపొందించాలని సూచించింది. పిల్లల ఆన్‌లైన్ భద్రతను కాపాడుతూనే వారి సమాచార హక్కు, భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కోర్టు వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

## ఆర్మీ ర్యాంకులు రీ-ఎంట్రీ!



**ఢిల్లీ :** దేశంలోనే అతిపెద్ద పారామిలిటరీ దళమైన సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. దాదాపు 30 ఏళ్ల క్రితం రద్దు చేసిన ఆర్మీ ర్యాంకులైన 'లాన్స్ నాయక్', 'నాయక్' హోదాలను తిరిగి ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సిబ్బందికి పదోన్నతులు ఆలస్యం కావడం, విధుల్లో అసంతృప్తిని తగ్గించడం, ఆర్మీ నుంచి పదవీ విరమణ చేసే అగ్నివీరులకు అవకాశాలు కల్పించడం ఈ ప్రతిపాదన వెనుక ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. ఈ మేరకు శనివారం అధికారుల ద్వారా ఈ వివరాలు వెల్లడైనట్లు జాతీయ మీడియా పేర్కొంది. ఈ ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా ఉన్న ఫీల్డ్ యూనిట్లు, బలగాల ప్రధాన కార్యాలయాలు భాగస్వామ్య సమావేశాలు లేదా 'సైనిక్ సమ్మేళనాలు' నిర్వహించి, సిబ్బంది అభిప్రాయాలను కేవలం రెండు రోజుల్లోగా సేకరించాలని సీఆర్‌పీఎఫ్ ప్రధాన కార్యాలయం ఆదేశించింది.

**నేపథ్యం ఏమిటి?**

సీఆర్‌పీఎఫ్ లో గతంలో ఉన్న లాన్స్ నాయక్, నాయక్ హోదాలను 1997లో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రద్దు చేసి, వాటిని కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ అనే పోలీసు హోదాలలో విలీనం చేశారు. అయితే, ఈ రెండు హోదాలు ఇప్పటికీ భారతీయ సైన్యంలో కొనసాగుతున్నాయి. అయితే ఆర్మీ నిబంధనల ప్రకారం ఒక జవాను కానిస్టేబుల్‌గా చేరిన తర్వాత 5 ఏళ్లకు లాన్స్ నాయక్, 10 ఏళ్లకు నాయక్, 20 ఏళ్లకు హెడ్ కానిస్టేబుల్ హోదా పొందుతాడు. ప్రస్తుతం సుమారు 3.25 లక్షల బలగంతో ఉన్న సీఆర్‌పీఎఫ్‌లో... కానిస్టేబుల్ స్థాయి సిబ్బందికి ప్రమోషన్ల విషయంలో తీవ్ర స్తబ్దత నెలకొంది. ప్రస్తుతం ఒక కానిస్టేబుల్‌కు మొదటి ప్రమోషన్ రావడానికి సరాసరిగా 22 నుంచి 25 సంవత్సరాలు పడుతోంది. ఒక్కటే ర్యాంకులో దశాబ్దాల తరబడి కొనసాగడం వల్ల జవాన్లలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి, హెడ్ కానిస్టేబుల్ స్థాయికి చేరేలోగా సిబ్బందికి మరో రెండు ప్రమోషన్లు కల్పించాలనే ఉద్దేశంతో లాన్స్ నాయక్, నాయక్ హోదాలను తిరిగి తీసుకురావాలని భావిస్తున్నారు. దీనివల్ల జవాన్ల నిరాశ తొలగిపోవడంతో పాటు వారిలో మనోధైర్యం పెరుగుతుందని అధికారులు తెలిపారు.

**అగ్నివీరుల కోసమేనా?**

కేంద్ర ప్రభుత్వ అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో నాలుగేళ్ల కాలానికి రిక్రూటైన తొలి విడత 'అగ్నివీరులు' త్వరలో రిటైర్ కానున్నారు. రిటైరైన అగ్నివీరులు సీఆర్‌పీఎఫ్ తో పాటు ఇతర కేంద్ర సాయుధ పోలీసు బలగాలలో (సీఆర్‌పీఎఫ్) చేరేందుకు అర్హులు. సీఆర్‌పీఎఫ్ సర్వీసును వారికి మరింత ఆకర్షణీయంగా మార్చేందుకే ఈ మార్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బలగాలలో అనధికారికంగా సీనియర్ కానిస్టేబుల్ హోదాను ఇస్తున్నారు గానీ నాయక్ హోదాకు ఎటువంటి ఏర్పాట్లు లేవు.

**భిన్నాభిప్రాయాలు:**

ఎక్స్-పారామిలిటరీ పర్సనల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రణ్‌బీర్ సింగ్ స్పందిస్తూ ఈ ప్రతిపాదిత విధానం వల్ల కాలానికి తగినట్లుగా ప్రమోషన్లు లభిస్తేనే జవాన్లకు మేలు జరుగుతుందని లేదంటే ఈ కసరత్తు వృథా అవుతుందని అభిప్రాయపడ్డారు. మ-రోవైపు ఈ హోదాల పునరుద్ధరణ కేవలం ఒక అలంకారిక చర్యగా ఉండకూడదని, బెటాలియన్ క్రమశిక్షణ, కార్యాచరణ సామ-ర్థ్యం దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఒక సీనియర్ కమాండెంట్ పేర్కొన్నారు.



## పరీక్ష తేదీలు మార్చండి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యాలయం ఎదుట శనివారం నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. ఆర్&బీ ఏఈఈ పరీక్ష, ఎస్ఎస్‌సీ జేఈ పరీక్ష రెండూ నవంబర్ 6వ తేదీనే ఉన్నాయని అందువల్ల ఏఈఈ పరీక్ష వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన నిరుద్యోగులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఏఈఈ పరీక్షతో పాటు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎస్ఎస్‌సీ జేఈ పరీక్షకు కూడా సిద్ధమవుతున్నారు. అయితే ఈ రెండు పరీక్షలు ఒకే రోజు ఉండటంతో అభ్యర్థులు ఒక పరీక్షకు దూరం అవుతామని అందువల్ల రాష్ట్రస్థాయి పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ ఇవాళ టీజీపీఎస్సీ కార్యాలయానికి పెద్ద ఎత్తున నిరుద్యోగులు తరలివచ్చి ఆందోళన చేపట్టారు. నిరుద్యోగుల ఆందోళనలతో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు.

**10 రోజులుగా విజ్ఞప్తి చేస్తున్నా స్పందన లేదు:**

పరీక్ష తేదీని మార్చాలని గత పది రోజులుగా టీజీపీఎస్సీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని నిరుద్యోగులు ఆరోపించారు. తమ సమస్యను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని, ఏఈఈ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తమకు పరీక్షల తేదీల గందరగోళం ఇబ్బందికరంగా మారిందని అభ్యర్థులు పేర్కొన్నారు. టీజీపీఎస్సీ అధికారులు వెంటనే స్పందించి పరీక్ష తేదీపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

## నేడు ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవ ప్రతీక, పూల పండుగ బతుకమ్మ ముగింపు వేడుకలకు హైదరాబాద్ మహానగరం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. సద్దుల బతుకమ్మ సంబరాల కోసం చారిత్రక ట్యాంక్‌బండ్ తీరం అద్భుత శోభను సంతరించుకోగా, ఈసారి వేడుకల్లో సరికొత్త గ్లామర్, అంతకుమించిన క్రేజ్ తోడవ్వనుంది. టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఇద్దరూ కలిసి ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుండటం ఇప్పుడు భాగ్యనగరంలో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ఆధునిక ఆకర్షణను జోడిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈసారి బతుకమ్మ వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది.నేడు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో జరగనున్న ఈ వేడుకల్లో సినీ తారలు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పాల్గొని సందడి చేయనున్నారు. వెండితెరపైనే కాకుండా బయట కూడా విశేషమైన క్రేజ్ సంపాదించుకున్న ఈ హిట్ కాంబినేషన్, సంప్రదాయ పూల పండుగ వేదికపై ప్రత్యక్షం కానుండటంతో అభిమానుల్లో, నగర పౌరుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. సినిమా తారల రాకతో పాటు వేడుకలను మరింత అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. హుస్సేన్‌సాగర్ అలల సాక్షిగా రాత్రి వేళ ఆకాశాన్ని మిరుమిట్లు గొలిపేలా ప్రత్యేక లేజర్ షోను ఏర్పాటు చేశారు. మరోవైపు తెలంగాణ మట్టి వాసనను, పల్లె జీవన సౌందర్యాన్ని చాటిచెప్పేలా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన దాదాపు 700 మంది జానపద కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో కదం తొక్కనున్నారు. రంగురంగుల పూల గోపురాలతో తరలివచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు సర్వసన్నద్ధమయ్యారు. ఒకవైపు సబ్బండ వర్ణాల పూల సంబరం, మరోవైపు సినీ తారల తళుకులు, ఇంకోవైపు లేజర్ వెలుగుల జిలుగులతో నేడు సాయంత్రం ట్యాంక్‌బండ్ సరికొత్త ఉత్సాహంతో ఊగిపోనుంది.

## రైతుకు గోవులను అందజేసిన జగద్గురు శ్రీ ఆదిశంకర గోశాల

**రామన్నపేట మండలం ఫ్లాష్ ఇండియా :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలోని జగద్గురు శ్రీ ఆదిశంకర గోశాల, ఆధ్వర్యంలో గోసేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రెండు గోవులు (ఎడ్లు ) బాచన్నగూడెం గ్రామం, కనగల్ (M), నల్గొండ (D) చెందిన రైతు కంచనపెల్లి నారాయణ కి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గోశాల నిర్వాహకులు మండల నర్సింహా మాట్లాడుతూ,గో రక్షణలో భాగంగా చేపట్టిన ఈ గో వితరణను రైతులు



సద్వినియోగం చేసుకోవాలని,గో హత్యలను అరికట్టాలని పిలుపునిచ్చారు.

## నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

**ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

**ఇబ్రహీంపట్నం,ఫ్లాష్ ఇండియా :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఎన్నికల విభాగం అధికారులతో ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఏఈఆర్‌ఓలు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు), సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకుంటూ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండాలని, అనర్హుల పేర్లు జాబితాలో లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8 దరఖాస్తులను పరిష్కరించడంతో పాటు, నోటీసుల జారీ ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల నుంచి సేకరించిన ధ్రువపత్రాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# మూడు దశల్లో సమగ్ర భూ సర్వే..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో భూ సమస్యలు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి, భూ యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను మూడు దశల్లో పూర్తి చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇప్పటికే 285 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేసి భూ యజమానుల నుంచి అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఇప్పటికే ఉన్న 411 రోవర్లకు అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయన్నారు. భూ సర్వేలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూ సమస్యలు లేని తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వం సమగ్ర రీసర్వేకు శ్రీకారం చుట్టిందన్నారు. శనివారం సచివాలయంలో రెవెన్యూ అధికారులతో భూ సర్వే పురోగతిపై నిర్వహించిన సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలకు గాను తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాలలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి, నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 285 గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనాధారమని మంత్రి పొంగులేటి అభిప్రాయపడ్డారు. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ యాజమాన్య హక్కులపై స్పష్టత తీసుకురావడంతో పాటు తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు పరిష్కారం చూపడంలో సమగ్ర రీసర్వే కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారాలుగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, సర్వే నంబర్ల ఉపవిభాగాలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దుల్లో మార్పులు చోటుచేసుకోవడం వంటి కారణాలతో భూముల అసలు హద్దులపై స్పష్టత కొరవడిందన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రీయ పద్ధతుల్లో సమగ్ర రీసర్వే చేపడుతున్నట్లు వివరించారు. గతంలో భూముల కొలతలకు ఉపయోగించిన గొలుసులు, కర్రలు, క్రాస్‌స్టాఫ్, మెజరింగ్ టేపుల వంటి సంప్రదాయ పరికరాలకు స్వస్తి పలికినట్లు మంత్రి చెప్పారు. డీజీపీఎస్, రోవర్లు, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా భూముల కొలతల్లో కచ్చితత్వం పెరగడంతో పాటు సర్వే వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరిచి, భవిష్యత్తులో సరిహద్దులపై వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అవసరమైన సాంకేతిక పరికరాలను సమకూరుస్తోందన్నారు. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేశామని, అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని వెల్లడించారు. రోవర్ల వినియోగంతో భూముల సర్వేను వేగంగా, కచ్చితత్వంతో నిర్వహించేందుకు వీలవుతుందని చెప్పారు. రీ సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా భూదార్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సర్వే సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తామని మంత్రి చెప్పారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 2.29 కోట్లకు పెరిగిందని వివరించారు. రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. రీసర్వే ద్వారా ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక సర్వే పటాలు సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా భూ యాజమాన్య హక్కులపై స్పష్టత పెరగడంతో పాటు భవిష్యత్తులో భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల సమయంలో ఎదురయ్యే సమస్యలను తగ్గించేందుకు వీలవుతుందన్నారు. తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని నేలకొండపల్లి మండలం కొంగర గ్రామ పరిధిలో ఉన్న మొత్తం 665 ఎకరాలలో వంద శాతం రీసర్వేను విజయవంతంగా పూర్తి చేశామని, త్వరలో భూదార్ పట్టాల పంపిణీ చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. భూ రీసర్వేలో అధికారులు తప్పనిసరిగా అనుసరించాల్సిన విధానాలపై మంత్రి గారు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో సర్వే నిర్వహించేందుకు వెళ్లే ముందు సంబంధిత పట్టాదారులకు విధిగా ముందస్తు నోటీసులు ఇవ్వాలని సూచించారు. సర్వే నిర్వహించే విషయం భూ యజమానులకు ముందుగానే తెలియజేయడం ద్వారా వారు అందుబాటులో ఉండి తమ భూముల హద్దులను నిర్ధారించుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. సర్వేకు ఒకటి రెండు రోజుల ముందు ఆయా గ్రామాల్లో తప్పనిసరిగా చాటింపు చేయాలని సూచించారు. అదే విధంగా, గ్రామాల్లోని ప్రభుత్వ భూములకు స్పష్టమైన మార్కింగ్ చేయాలని, గ్రామకంఠం హద్దులను నిర్ధారించిన తర్వాతే సర్వే చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, గ్రామకంఠం పరిధుల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో స్పష్టత తీసుకురావాలని సూచించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ యజమానుల అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి, పరిశీలించి పరిష్కరించాలని మంత్రి తెలిపారు. సర్వే ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూ రీసర్వేను అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా భావించకుండా, ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అత్యంత కీలక బాధ్యతగా గుర్తించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో, అంకితభావంతో పనిచేసి రీసర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. సర్వే సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, భూ యజమానులు సంతృప్తి చెందేలా ప్రతి చర్య చేపట్టాలని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజా కోణంలోనే ఆలోచించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. సమీక్షలో సీసీఎల్ఏ డీఎస్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సంఘం భవనాల వద్ద నిర్మాణ పనులకుభూమిపూజ

**వికారాబాద్ జిల్లా/ చౌడాపూర్ మండల, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుములరేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలో మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారత, స్వయం సమృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ SIR ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డా . టి. రామ్మోహన్ రెడ్డి గారి ప్రత్యేక కృషితో చౌడాపూర్ మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు ఒక్కో మహిళా సంఘం భవన నిర్మాణానికి రూ. 10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో మహిళా సంఘం భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి మహిళా సంఘం భవనం వద్ద బాత్రూమ్, వాష్‌రూమ్ నిర్మాణానికి అదనంగా రూ. 1 లక్షా 20 వేల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా చౌడాపూర్ మండలంలోని మహిళా సంఘం భవనం వద్ద మంజూరైన బాత్రూమ్ నిర్మాణ పనులకు ముగ్గు వేసి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం చంద్రశేఖర్, అధికారులతో, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొని భూమిపూజ నిర్వహించారు. మహిళల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం -- ఎం. చంద్రశేఖర్, ఈ సందర్భంగా ఎం. చంద్రశేఖర్ గారు మాట్లాడుతూ, మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి, సాధికారత కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. మహిళా సంఘాలకు ప్రత్యేక భవనాలు నిర్మించడంతోపాటు బాత్రూమ్‌లు, వాష్‌రూమ్‌లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా మహిళలకు మరింత సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల సమావేశాలు, పొదుపు సంఘాల కార్యకలాపాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఈ భవనాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. చౌడాపూర్ మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు మహిళా సంఘం భవనాలు మంజూరు చేయించడంలో ప్రత్యేక చొరవ చూపిన పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి ఎమ్మెల్యే గారికి మహిళల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు. తెలియజేశారు. మంజూరైన నిర్మాణ పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేసి మహిళా సంఘాలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ నర్సింహులు, మండల అభివృద్ధి అధికారి (ఇన్‌చార్జ్) వెంకన్నగౌడ్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ గోపాల్, ఎఫ్ఏ అశ్విన్, పాల్గొన్నారు. అలాగే గ్రామ సర్పంచ్ శ్రీమతి రజిత నర్సింహులు, ఉప సర్పంచ్ ఏడ్ల రాములమ్మ శ్రీను గారు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ నాయకులు రఘు, కృష్ణయ్య, చెన్నయ్య, కటికే యాదిలాల్, జి. చెన్నయ్య, బాలకిస్టాయ , సోషల్ మీడియా నరేందర్ కార్యకర్తలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళల సాధికారతే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయం!

# 13 కోట్ల ఓట్లను తొలగించారు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రస్తుతం భారతదేశం అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిలో ఉందని.. అందరూ కలిసి కట్టుగా పోరాటం చేయాలని ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఈరోజు(శనివారం) మీడియాతో మాట్లాడుతూ.. 2014లో మోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ రక్షణ కోసం 2017లో రాహుల్ గాంధీ ప్రొఫెషనల్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. రాజ్యాంగాన్ని రక్షించాలంటే ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పాత్ర కీలకమని చెప్పుకొచ్చారు. ఇతర పార్టీలో ఉన్న వారు కూడా ప్రొఫెషనల్ కాంగ్రెస్‌లో భాగం పంచుకోవచ్చని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సభ్యత్వంలేని వారు కూడా రాజ్యాంగ పరిరక్షణ కోసం పని చేయొచ్చని అన్నారు. దేశంలో 'సర్' ద్వారా 13 కోట్ల ఓట్లను మోదీ ప్రభుత్వం తొలగించిందని మధుయాష్కీ ఆరోపించారు. 13 కోట్ల ఓట్లలో ఎక్కువ మంది దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓట్లు ఉన్నాయన్నారు. తొలగించిన 13 కోట్ల ఓట్లు ఆధారాలతో బయటపెట్టామని అన్నారు. సర్ పై పోరాటం కాంగ్రెస్ భవిష్యత్తు కోసం కాదని.. దేశ ప్రజల భవిషత్తు కోసమని స్పష్టం చేశారు. బీజేపీ మోదీ ప్రభుత్వం పౌరుల స్వేచ్ఛను కలరాస్తోందని విమర్శించారు. క్లిష్ట సమయంలో తనకు అప్పజెప్పిన ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. మనోహ్మన్ సింగ్ ఫెలోషిప్ ద్వారా వివిధ రంగాల్లో వచ్చిన నిష్ణాతులైన 50 మందికి ఒక సంవత్సరం పాటు ట్రైనింగ్ ఇచ్చారని మాధుయాష్కీ తెలిపారు. రెండో దఫా 800 అప్లికేషన్స్ వచ్చాయని.. 100 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. బారిస్టర్లు, లాయర్లు, డాక్టర్లతో ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఏర్పడిందని.. దీనితోనే స్వాతంత్ర్యం ఏర్పడిందన్నారు. భారత పౌరులకు రక్షణ కల్పించేది రాజ్యాంగమన్నారు. ప్రొఫెషనల్స్‌కు క్రెడిబులిటి ఉండాలని రాహుల్ గాంధీ ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకరావడంలో ప్రొఫెషనల్స్ కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఇప్పుడున్న క్లిష్ట పరిస్థితుల కోసం ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పని చేస్తోందన్నారు. ప్రజలకు, ప్రతి పౌరుడికి గౌరవ ప్రదమైన జీవితం అందించడానికి ప్రొఫెషనల్ కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందని తెలిపారు. నిష్ణాతులతో ప్రొఫెషనల్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు చేశామని మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు.

# ఐటీ టవర్ల ఏర్పాటుకు కృషి చేస్తాం

**హనుమకొండ,ఫ్లాష్ ఇండియా :** వరంగల్, హనుమకొండ నగరాలకు ఐటీ టవర్ల ఏర్పాటు కోసం అవసరమైన ప్రతిపాదనలను పరిశీలించి, రానున్న రోజుల్లో ముందుకు తీసుకెళ్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన వరంగల్ నగరంలో పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భద్రకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ (ఎడిషన్-2)ను ప్రారంభించిన అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి నగరంలోని ప్రముఖ ఆలయాలను సందర్శించారు. తొలుత శ్రీ పద్మాక్షి అమ్మవారిని దర్శించుకుని, హోమపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమా రాజేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు. వరంగల్ నగరానికి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెప్పే శ్రీ భద్రకాళి అమ్మవారి రథ నిర్మాణ పనులు పూర్తికావడంతో, ఆలయ అధికారులు, అర్చకుల ఆధ్వర్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని ముందుకు లాగి ప్రారంభించారు. మాడవీధుల్లో ఊరేగింపునకు సిద్ధమైన అమ్మవారి రథం ప్రారంభం కావడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం ప్రముఖ శైవక్షేత్రమైన వేయిస్తంభాల దేవాలయంలో శ్రీ రుద్రేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి వద్ద కూడా పూజల్లో పాల్గొన్నారు. వరంగల్ నగరం చారిత్రక కట్టడాలు, ప్రాచీన ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయమని మంత్రి తెలిపారు. ఈ ప్రాంత వారసత్వ సంపదను కాపాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు వరంగల్, హనుమకొండ నగరాల్లో ఐటీ టవర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల అధికారులు, ప్రధాన అర్చకులు, పురోహితులు మంత్రికి, ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా శ్రీ భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకులు శేషు, వేయిస్తంభాల రుద్రేశ్వర దేవాలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోరు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాలు మళ్లీ ఒక్కసారిగా వేడెక్కాయి. త్వరలో జరగనున్న పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు సవాలుగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఈ ఎన్నికలు 'లిట్మస్ టెస్ట్' లాంటివని రాజకీయ విశ్లేషకులు భావిస్తుండటంతో గెలుపే లక్ష్యంగా అధికార పక్షం ప్రణాళికలు రచిస్తోంది. మరోవైపు గులాబీ దళం కూడా ఈ ఎన్నికలను తిరిగి పుంజుకోవడానికి ఒక మంచి అవకాశంగా భావిస్తోంది. దీంతో ఈ ఎన్నికల్లో వ్యూహాలు ప్రతి వ్యూహాలు ఆసక్తిని రేపుతున్నాయి.

**నిన్న సీపీఎం.. నేడు టీజేఎస్ వద్దకు..**

పట్టభద్రుల నియోజకవర్గాల్లో విద్యావంతులు, ఉద్యోగులు, నిరుద్యోగుల ఓట్లే కీలకం కానున్నాయి. దీంతో ఎలాంటి రిస్క్ తీసుకోకూడదని భావించిన కాంగ్రెస్ అధిష్టానం, మిత్రపక్షాలు, విపక్ష శక్తులను ఏకం చేసే పనిలో పడింది. ఇందులో భాగంగా శనివారం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్‌తో కూడిన బృందం నాంపల్లిలోని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర కార్యాలయానికి వెళ్లింది. అక్కడ టీజేఎస్ అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంతో పాటు ఇతర ముఖ్య నేతలతో భేటీ అయ్యారు. రాబోయే ఎమ్మెల్సీ సమరంలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని అధికారికంగా విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు నిన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని కలిసిన మహేశ్ కుమార్ గౌడ్ ఆ పార్టీ మద్దతు కోరారు. తాజాగా ఇవాళ టీజేఎస్ సపోర్టు కోరారు. కాంగ్రెస్ అభ్యర్థనపై స్పందించిన ప్రొఫెసర్ కోదండరాం.. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యల పరిష్కారం, పాలనలో టీజేఎస్ భాగస్వామ్యం మరియు ఎన్నికల హామీల అమలుపై కాంగ్రెస్ నేతలతో చర్చించాం. మద్దతు ఇచ్చే అంశంపై పార్టీ రాష్ట్ర కమిటీలో చర్చించి త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

**పొత్తుల కోసం బీఆర్ఎస్ ప్రయత్నాలు!:**

ఇదిలా ఉంటే కాంగ్రెస్‌పై పై చేయి సాధించడంతో పాటు తమ ఉనికిని చాటుకునేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా పొత్తుల కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా లెఫ్ట్ పార్టీలైన సీపీఐ, సీపీఎం మద్దతును తమవైపు తిప్పుకునేందుకు గులాబీ పార్టీ వేగంగా పావులు కదుపుతోందని ప్రచారం జరుగుతోంది. దీంతో ఓ వైపు అధికార కాంగ్రెస్, మరో వైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పొత్తుల రాజకీయం ఇప్పుడు ఆసక్తి రేకెత్తిస్తోంది. సీపీఐ ఇప్పటికే కాంగ్రెస్‌తో సత్సంబంధాలతో ఉండటంతో, మిగిలిన లెఫ్ట్ ఓటు బ్యాంకును తమ వైపే తిప్పుకోవాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**ఎందుకీ ఎన్నిక ఇంత కీలకం?**

అసెంబ్లీ ఎన్నికల తర్వాత మేధావులు, పట్టభద్రులు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై ఎలాంటి అభిప్రాయంతో ఉన్నారో తెలిపే కొలమానంగా ఈ ఎన్నికలు మారనున్నాయి. ఇటీవల చేపట్టిన నోటిఫికేషన్లు, ఉద్యోగ నియామకాలు, నిరుద్యోగ భృతి వంటి అంశాలు ఈ ఎన్నికల ఫలితాలను తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో గెలిస్తే అసెంబ్లీ ఓటమి నుంచి కోలుకుని మళ్లీ కేడర్‌లో ఉత్సాహం నింపవచ్చని బీఆర్ఎస్, బీజేపీలు భావిస్తున్నాయి. దీంతో ఈ ఎన్నికను ప్రధాన పార్టీలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి.

# చక్కెర ధరలకు కళ్లెం..

## ఇథనాల్ తయారీపై కేంద్రం కీలక నిర్ణయం!

**ఢిల్లీ:** ఎల్ నినో భయాందోళనల వేళ దేశంలో పెరుగుతున్న చక్కెర ధరలకు అడ్డుకట్ట వేసేందుకు, స్థానిక మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చెరుకు నుంచి ఇథనాల్‌ను తయారు చేసే విధానానికి తాత్కాలికంగా అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వ రంగ ఇంధన రిటైలర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. చక్కెరతో పాటు చెరుకు రసం, షుగర్ సిరప్, బీ-హెవీ మొలాసిస్ వాడకాన్ని ప్రభుత్వం విషేధించింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా షుగర్ ధరలు అదుపులోకి రానున్నాయి.

**వచ్చే నెల నుంచి కొత్త రూల్స్:**

వచ్చే నవంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న 2026-27 సరఫరా సంవత్సరానికి సంబంధించి ఎథనాల్ టెండర్లను జారీ చేశాయి. ఈ తాజా టెండర్లలో చెరకు రసం, షుగర్ సిరప్, బి-హెవీ మొలాసిస్ వంటి చెరకు ఆధారిత ముడిసరుకులకు పూర్తిగా మినహాయింపునిచ్చాయి. గత చక్కెర సరఫరా సీజన్‌లో దేశీయ అవసరాలకు సరిపడా చక్కెర ఉత్పత్తి చేయడమే సవాలుగా మారింది. దేశంలో ఏటా సుమారు 280 నుంచి 285 లక్షల టన్నుల చక్కెర అవసరమవుతుండగా, గత సీజన్‌లో నికర ఉత్పత్తి దేశీయ డిమాండ్‌కు కొద్దిమేరకే సరిపోయినట్లు నివేదికలు పేర్కొన్నాయి. దీంతో రాబోయే పండుగల సీజన్‌లో చక్కెర కొరత ఏర్పడకుండా నిల్వలను పెంచడంపై కేంద్రం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**ఇతర ధాన్యాలకు డిమాండ్!:**

ఇథనాల్ తయారీకి షుగర్ వాడకంపై బ్యాన్ విధించడంతో మొక్కజొన్న, విరిగిన బియ్యం, అదనపు ఆహార ధాన్యాలు, భారత ఆహార సంస్థ వద్ద ఉన్న మిగులు బియ్యం వంటి ధాన్యాల ఆధారంగా ఇథనాల్ ఉత్పత్తికి ప్రాధాన్యం పెరగనున్నట్లు తెలుస్తోంది. చక్కెర పరిశ్రమ నుంచి వచ్చే సీ-హెవీ మొలాసిస్ వంటి ప్రత్యామ్నాయ ముడి పదార్థాల వినియోగంపైనా దృష్టి సారించనున్నారు. కాగా భారత్‌లో పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే కార్యక్రమం కింద 20 శాతం ఇథనాల్ మిశ్రమం (E20) లక్ష్యాన్ని నిర్దేశించిన గడువుకంటే ముందుగానే సాధించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం సుమారు 2,000 కోట్ల లీటర్లకు చేరినట్లు అంచనాలు ఉన్నాయి.

# భూగర్భ జలాల పరిరక్షణ, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి




**నారాయణపేట,ఫ్లాష్ ఇండియా :** జిల్లాలో భూగర్భ జలాల మట్టాలు పడిపోతున్న నేపథ్యంలో రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పలు గ్రామాల్లో బోర్లు ఎండిపోతున్నందున నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా పరిస్థితులను పరిశీలించి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించాలని తెలిపారు. గ్రామాల్లో నీటి వృథాను అరికట్టడంతో పాటు పైపులైన్ల లీకేజీలను వెంటనే మరమ్మతు చేయించాలని కలెక్టర్ సూచించారు. భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణకు ఉపాధి హామీ పథకం కింద ఫామ్ పాండ్స్, సోక్ పిట్స్, బోర్ల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, తాగునీటి సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలతో కూడిన కార్యాచరణ నివేదికలను సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రం సమీపంలోని సింగారం మలుపు వద్ద ఉన్న వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో డీఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఈ సూచనలు చేశారు. ఉపాధి హామీ పనులు, తెలంగాణ జలసిరి కార్యక్రమం అమలుపై సమీక్షిస్తూ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో శ్రీనివాస్ రావు, డీఆర్డీవో వెంకట్ రాములు, ప్రత్యేక అధికారి స్టీఫెన్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, వివిధ శాఖల అధికారులు, విబి-జీ రామ్ జీ సిబ్బంది పాల్గొన్నారు.

## సంపాదకీయం

# పుస్తకం చేతిలో.. ప్రశ్నించే చైతన్యం గుండెల్లో!

### చదువు కొందరి హక్కుగా, మరికొందరి కలగా మిగిలిన సమాజంలో తన్ను కుమారి తిరుగుబాటు ఒక సామాజిక పాఠం

పుస్తకం మనిషి జీవితాన్ని మార్చగలదా? సమాజం సహజమని అంగీకరించిన అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని ఇవ్వగలదా? తరతరాలుగా కొనసాగుతున్న వివక్షను గుర్తించి, దానికి వ్యతిరేకంగా నిలబడే చైతన్యాన్ని కలిగించగలదా? జార్ఖండ్‌కు చెందిన 17 ఏళ్ల తన్ను కుమారి కథ ఈ ప్రశ్నలకు బలమైన సమాధానం ఇస్తుంది. ఒక కామిక్ పుస్తకం ఆమె ఆలోచనలను మార్చింది. ఆలోచనలు ప్రశ్నలుగా మారాయి. ప్రశ్నలు కుటుంబంలో మార్పుకు దారితీశాయి. ఒకప్పుడు భయంతో మౌనంగా ఉండే బాలిక, ఇప్పుడు తనతో పాటు ఇతర బాలికల హక్కుల కోసం మాట్లాడుతోంది. ఇది ఒక అమ్మాయి వ్యక్తిగత విజయగాథ మాత్రమే కాదు. భారతీయ సమాజంలో పాతుకుపోయిన పితృస్వామ్య భావజాలంపై ఒక చిన్నారి సంధించిన సామాజిక ప్రశ్న.తన్ను కుటుంబంలో ఆడపిల్లలను ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివిస్తూ, అబ్బాయిని మాత్రం ప్రైవేట్ విద్యాసంస్థకు పంపించారు. అమ్మాయిలు సైకిళ్లపై పక్క గ్రామాలకు వెళ్లడం సురక్షితం కాదనే కారణాన్ని తల్లిదండ్రులు ముందుకు తెచ్చారు. పైకి చూస్తే అది పిల్లల భద్రతపై శ్రద్ధగా కనిపించవచ్చు. కానీ ఆ నిర్ణయం వెనుక ఉన్న అసమానతను తన్ను క్రమంగా గుర్తించింది. తన తల్లి రత్నాదేవిని తొమ్మిదో తరగతి తర్వాత చదువు మాన్పించడం, కుటుంబంలోని మగవారికి మాత్రం విద్యను కొనసాగించే అవకాశం కల్పించడం, ఇప్పుడు తన జీవితంలోనూ అదే పునరావృతం కావడం ఆమెను ఆలోచింపజేశాయి. ఒకే కుటుంబంలో పుట్టిన పిల్లలకు విద్యావకాశాలు ఎందుకు వేర్వేరుగా ఉండాలి? ఆడపిల్లలకు భద్రత పేరుతో పరిమితులు విధించి, అబ్బాయిలకు అవకాశాలు కల్పించడం ఏ న్యాయం? తన్ను తిరుగుబాటు ఈ ప్రశ్నల నుంచే మొదలైంది.

**పితృస్వామ్యం.. కుటుంబం నుంచే మొదలయ్యే అసమానత**

సమాజంలో స్త్రీలపై వివక్ష ఎప్పుడూ బహిరంగంగా కనిపించదు. అనేక సందర్భాల్లో అది ప్రేమ, రక్షణ, సంప్రదాయం, కుటుంబ గౌరవం వంటి సానుకూలంగా వినిపించే పదాల వెనుక దాగి ఉంటుంది. ఆడపిల్ల బయటకు వెళ్లకూడదని, ఎక్కువ చదివితే ఉపయోగం లేదని, చివరకు పెళ్లి చేసుకుని మరో ఇంటికి వెళ్లిపోతుందని చెప్పే భావజాలం ఆమె భవిష్యత్తును ముందుగానే నిర్ణయిస్తుంది. అబ్బాయి చదువు కుటుంబానికి పెట్టుబడిగా కనిపిస్తే, అమ్మాయి చదువు అనవసర ఖర్చుగా భావించే ధోరణి ఇప్పటికీ అనేక కుటుంబాల్లో కనిపిస్తోంది.మార్క్సిస్టు, సామ్యవాద దృక్పథంలో ఈ అసమానతను పరిశీలిస్తే, విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే సంబంధించిన అంశం కాదు. అది సామాజిక వనరుల పంపిణీ, ఆర్థిక స్వాతంత్ర్యం, అధికార సంబంధాలతో ముడిపడి ఉంటుంది. కుటుంబంలో ఆస్తి, ఆదాయం, నిర్ణయాధికారం పురుషుల చేతుల్లో కేంద్రీకృతమైనప్పుడు, మహిళల విద్యపై కూడా ఆ ఆధిపత్యం ప్రభావం చూపుతుంది. విద్యకు దూరమైన అమ్మాయి ఆర్థికంగా ఇతరులపై ఆధారపడే పరిస్థితిలోకి నెట్టబడే ప్రమాదం ఉంది. ఆ ఆధారపడే స్థితి తిరిగి పితృస్వామ్య వ్యవస్థను బలపరుస్తుంది. ఇలా వివక్ష ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అవుతుంది.అయితే పేదరికం, భద్రతా సమస్యలు, పాఠశాలల దూరం వంటి వాస్తవ సమస్యలను కూడా విస్మరించలేం. వాటికి పరిష్కారం అమ్మాయిల అవకాశాలను తగ్గించడం కాదు. సురక్షిత రవాణా, మెరుగైన పాఠశాలలు, వసతి సౌకర్యాలు, ఆర్థిక సహాయం కల్పించడం. సమానత్వం అంటే అందరినీ ఒకే పరిస్థితిలో ఉంచడం మాత్రమే కాదు; ప్రతి ఒక్కరికీ ఎదిగే అవకాశం కల్పించే పరిస్థితులను నిర్మించడం కూడా.

**ఒక కామిక్ పుస్తకం.. ఒక సామాజిక మేల్కొలుపు**

తన్ను జీవితంలో కీలకమైన మార్పుకు కారణమైనది UNICEF మద్దతుతో రూపొందించిన 'ఆధా ఫుల్' కామిక్ సిరీస్. అందులోని కథలు అమ్మాయిలకు తమ హక్కుల గురించి తెలియజేస్తూ, వివక్షను ప్రశ్నించే స్ఫూర్తిని అందిస్తాయి. ఈ కథల ప్రభావంతో తన్ను తన కుటుంబంలో జరుగుతున్న అసమానతను వ్యక్తిగత విధిగా కాకుండా సామాజిక సమస్యగా చూడటం ప్రారంభించింది.ఇదే పుస్తకం శక్తి. అది పాఠకుడికి సమాచారాన్ని అందించడమే కాకుండా, తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కొత్త కోణంలో పరిశీలించే సామర్థ్యాన్ని ఇస్తుంది. ఇప్పటివరకు సహజంగా భావించిన పరిస్థితి అన్యాయమని గుర్తించేలా చేస్తుంది. అయితే చదువు అంటే అక్షరాలను నేర్చుకోవడం మాత్రమే కాదు. ఆ అక్షరాల ద్వారా సమాజాన్ని అర్థం చేసుకోవడం, అధికారాన్ని ప్రశ్నించడం, హక్కుల కోసం నిలబడటం నిజమైన విద్య.పాఠశాలలో నిర్వహించిన పాత్రధారణ కార్యక్రమాలు తన్నులో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. ఇంట్లో తన తమ్ముడికి లభిస్తున్న అవకాశాలు తనకు, తన చెల్లికి ఎందుకు లభించడం లేదని ఆమె ప్రశ్నించింది. మొదట్లో అభ్యంతరం తెలిపిన తండ్రి చివరకు ఆమె మాటలకు అంగీకరించినట్లు కథనం చెబుతోంది. కుటుంబంలో మార్పు రావడం చిన్న విషయం కాదు. ఎందుకంటే అనేక సందర్భాల్లో మహిళల హక్కులపై చర్చను కూడా కుటుంబ పెద్దల అనుమతికి లోబరచే వ్యవస్థ మనకు కనిపిస్తుంది. అలాంటి పరిస్థితిలో ఒక బాలిక తన భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే హక్కును కోరడం సామాజిక చైతన్యానికి సంకేతం.

**వ్యక్తిగత ధైర్యం నుంచి సామూహిక చైతన్యం వరకు**

తన్ను తనను అవమానించిన నానమ్మకు తన చర్మరంగంపై ప్రశ్నిస్తూ సమాధానం చెప్పడం, తండ్రి మద్యపానం కారణంగా కుటుంబంలో ఏర్పడే గొడవల గురించి మాట్లాడటం వంటి సంఘటనలు ఆమె ఆత్మవిశ్వాసంలో వచ్చిన మార్పును సూచిస్తాయి. అయితే ఈ పరిణామాలను ఒక బాలిక ఒంటరిగా కుటుంబంలోని అన్ని సమస్యలను పరిష్కరించగలదనే కోణంలో చూడకూడదు. మద్యపానం, కుటుంబ హింస వంటి సమస్యలకు వ్యక్తిగత సంకల్పంతో పాటు సామాజిక మద్దతు, బాధ్యతాయుతమైన కుటుంబ వాతావరణం, అవసరమైన సహాయ వ్యవస్థలు కూడా కీలకం.తన్ను తన చదువును కొనసాగించడమే కాకుండా, పదో తరగతి తర్వాత చదువు ఆపేయాలనుకున్న స్నేహితురాలి విద్యకు మద్దతుగా నిలిచింది. గ్రామంలోని బాలికలు బాల్యవివాహాలను ప్రశ్నించాలని ప్రోత్సహిస్తోంది. న్యాయవాదిగా మారి హక్కులు తెలియని వారి తరఫున నిలబడాలనేది ఆమె లక్ష్యం.ఇక్కడే ఆమె కథకు మరింత విస్తృతమైన సామాజిక ప్రాధాన్యత లభిస్తుంది. ఒక వ్యక్తి సాధించిన మార్పు మరొకరికి అవకాశంగా మారినప్పుడు అది సామూహిక చైతన్యానికి పునాది అవుతుంది. హక్కులపై అవగాహన కలిగిన బాలికలు తమ జీవితాలపై నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగడమే కాకుండా, ఇతర బాలికలకు కూడా మార్గం చూపగలరు.

**సమానత్వం దాతృత్వం కాదు.. హక్కు**

తన్ను కథను కేవలం ప్రేరణాత్మక కథగా చదివి ముగిస్తే దాని అసలు సందేశాన్ని కోల్పోయినట్లే. ఒక బాలిక ధైర్యంగా మాట్లాడగలగడం అభినందనీయం. కానీ ప్రతి బాలిక తన హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడుతోంది? విద్య పొందడానికి కుటుంబాన్ని ఒప్పించాల్సిన అవసరం ఎందుకు వస్తోంది? బాల్యవివాహాన్ని నివారించడానికి పిల్లలే పెద్దలను ప్రశ్నించాల్సిన పరిస్థితి ఎందుకు కొనసాగుతోంది? ఇవే సమాజం ఎదుర్కోవాల్సిన అసలు ప్రశ్నలు.ప్రభుత్వాలు నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందుబాటులోకి తీసుకురావాలి. బాలికల కోసం సురక్షిత రవాణా, వసతి, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలి. పాఠశాలల్లో లింగ సమానత్వంపై అవగాహన పెంచాలి. బాల్యవివాహాల నిరోధానికి చట్టాల అమలుతో పాటు కుటుంబాలు, గ్రామస్థాయి సంస్థలు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలి. పేదరికం కారణంగా పిల్లలు చదువు మానేయకుండా ఆర్థిక, సామాజిక సహకారం అందించాలి. విద్యను మార్కెట్‌లో కొనుగోలు చేయగల వస్తువుగా కాకుండా, ప్రతి చిన్నారికి అందాల్సిన ప్రాథమిక హక్కుగా చూడాలి.తన్ను కుమారి కథలో పుస్తకం ఒక నిప్పురవ్వలా పనిచేసింది. కానీ ఆ నిప్పురవ్వ సమాజమంతా వెలుగులు నింపాలంటే సంస్థాగత మార్పులు అవసరం. వ్యక్తిగత ధైర్యాన్ని వ్యవస్థాగత అవకాశాలుగా మార్చాలి. ఒక అమ్మాయి తన హక్కును సాధించడం విజయమే; ప్రతి అమ్మాయికి ఆ హక్కు కోసం పోరాడాల్సిన అవసరం లేకుండా చేయడం సమాజం సాధించాల్సిన విజయం.అంతిమంగా, పుస్తకం జీవితాన్ని మార్చగలదు. కానీ సమాజాన్ని మార్చాలంటే ఆ పుస్తకం కలిగించిన ప్రశ్నలు కుటుంబాల్లోకి, పాఠశాలల్లోకి, ప్రభుత్వ విధానాల్లోకి చేరాలి. తన్ను కుమారి కథ మనకు చెప్పే సామ్యవాద సందేశం ఇదే–సమానత్వం ఎవరో ఇచ్చే వరం కాదు; ప్రతి మనిషికి దక్కాల్సిన హక్కు. ఆ హక్కుపై అవగాహన కలిగినప్పుడే మౌనం ప్రశ్నగా మారుతుంది, ప్రశ్న చైతన్యంగా ఎదుగుతుంది, చైతన్యం సామాజిక మార్పుకు దారితీస్తుంది.

# మంత్రుల పనితీరుపై నజర్..!



తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ అంశం మరోసారి రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. మంత్రుల పనితీరు, శాఖల నిర్వహణ, పార్టీ పట్ల బాధ్యత, ప్రతిపక్షాల విమర్శలకు స్పందిస్తున్న తీరు వంటి అంశాలపై అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) దృష్టి సారించినట్లు వస్తున్న సమాచారం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వంలో ఎవరి పాత్ర ఎలా ఉంది? ఎవరు తమ శాఖలపై పట్టు సాధించారు? పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠను కాపాడటంలో ఎవరు చురుగ్గా వ్యవహరిస్తున్నారు? అనే అంశాలు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో కీలకంగా మారే అవకాశం ఉంది.మంత్రివర్గంలో కొనసాగడం కేవలం పదవిని అనుభవించడానికే పరిమితం కాకూడదు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, శాఖల పనితీరులో పారదర్శకత, ప్రజాప్రతినిధులతో సమన్వయం, పాలనలో జవాబుదారీతనం వంటి అంశాలే మంత్రుల పనితీరుకు ప్రామాణికాలుగా ఉండాలి. ఈ నేపథ్యంలో ఏఐసీసీ సేకరిస్తున్నట్లు ప్రచారంలో ఉన్న సమాచారానికి ప్రాధాన్యత ఏర్పడింది. అయితే, మంత్రులకు గ్రేడింగ్‌లు ఇస్తున్నారనే అంశంపై అధికారిక స్పష్టత లేకపోవడంతో, దీనిని పార్టీ అంతర్గత సమీక్షకు సంబంధించిన సమాచారంగానే చూడాల్సి ఉంటుంది.

**ఫిర్యాదులే ప్రామాణికమా.. పాలనా ఫలితాలే గీటురాయా?**

మంత్రులపై పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సహచర మంత్రుల నుంచి ఫిర్యాదులు అందుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొందరు తమ అసంతృప్తిని పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తుండగా, మరికొందరు లేఖలు, ఫ్యాక్స్, ఈ–మెయిల్స్ ద్వారా ఫిర్యాదులు చేస్తున్నట్లు సమాచారం. శాఖల నిర్వహణ, నిర్ణయాలు తీసుకునే విధానం, ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండటం, అభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి అంశాలు ఈ ఫిర్యాదుల్లో ప్రస్తావనకు వస్తున్నట్లు తెలుస్తోంది.అయితే, రాజకీయ ఫిర్యాదులు చేయడం ఒక అంశమైతే, వాటిలోని వాస్తవాలను నిర్ధారించడం మరో అంశం. సహచరుల మధ్య విభేదాలు, శాఖల కేటాయింపులపై అసంతృప్తి, స్థానిక రాజకీయ ప్రయోజనాలు కూడా ఫిర్యాదులకు కారణమయ్యే అవకాశం ఉంది. అందువల్ల, కేవలం ఆరోపణల ఆధారంగా మంత్రుల భవితవ్యాన్ని నిర్ణయించడం కంటే, వాటిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, పాలనా ఫలితాలతో పోల్చి చూడటం అవసరం.అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రుల విషయంలోనూ ఇదే సూత్రం వర్తించాలి. ఆరోపణలు వచ్చినంత మాత్రాన తప్పు నిర్ధారణ అయినట్లు కాదు. అదే సమయంలో, తీవ్రమైన ఆరోపణలను రాజకీయ వివాదంగా కొట్టిపారేయడం కూడా సమంజసం కాదు. వాస్తవాల పరిశీలన, పారదర్శకత, బాధ్యతాయుతమైన చర్యలే ప్రభుత్వ విశ్వసనీయతను నిలబెట్టగలవు.

**ఆరు బెర్తుల చుట్టూ ఆశావహుల రాజకీయం**

ప్రస్తుతం మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాలు, మరికొందరి మార్పుపై సాగుతున్న చర్చలు కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీసే అవకాశం ఉంది. దాదాపు ఆరుగురికి అవకాశం లభించవచ్చనే ప్రచారం పార్టీ ఆశావహుల్లో అంచనాలను పెంచుతోంది. అయితే, ఎంతమందిని తీసుకుంటారు? ఎవరిని కొనసాగిస్తారు? ఎవరి శాఖలు మారతాయి? అనే అంశాలపై అధికారిక ప్రకటన వెలువడే వరకు స్పష్టత లేదు.మంత్రివర్గ విస్తరణ అనేది ముఖ్యమంత్రి వ్యక్తిగత ప్రాధాన్యతలకు మాత్రమే పరిమితమయ్యే అంశం కాదు. పార్టీ అధిష్ఠానం అభిప్రాయం, ప్రాంతీయ ప్రాతినిధ్యం, సామాజిక సమీకరణాలు, పార్టీకి విధేయత, పాలనా అనుభవం, ప్రజాప్రతినిధులతో సమన్వయం వంటి అనేక అంశాలు ఇందులో ప్రభావం చూపుతాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాధాన్యతలతో పాటు పార్టీ నాయకత్వం అభిప్రాయాలు కూడా నిర్ణయ ప్రక్రియలో కీలకంగా మారవచ్చు.ఇప్పటికే మంత్రి పదవులు ఆశిస్తున్న నేతలు తమకు అవకాశం రావాలని ఎదురుచూస్తున్నారు. కొందరు ప్రాధాన్యత లేని శాఖలు కేటాయించారనే అసంతృప్తిని వ్యక్తం చేస్తుండగా, మరికొందరు తమకు మరింత కీలకమైన బాధ్యతలు ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. ఈ పరిణామాలు కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల్లో పదవుల పంపిణీ ఎంత సున్నితమైన అంశంగా మారిందో సూచిస్తున్నాయి.

**ఎన్నికల కేబినెట్ అంటే బాధ్యతల పునర్విభజన కూడా!**

తదుపరి మంత్రివర్గ విస్తరణను ఎన్నికలకు ముందు కీలకమైన పునర్వ్యవస్థీకరణగా పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సమయానికి ప్రభుత్వ పనితీరు ప్రజలకు స్పష్టంగా కనిపించాలంటే, శాఖల నిర్వహణలో వేగం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ శ్రేణులతో సమన్వయం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేసే విమర్శలకు మంత్రులు స్పందించకపోవడం పార్టీ అంతర్గతంగా చర్చనీయాంశమైందనే సమాచారం కూడా వినిపిస్తోంది. అయితే, ప్రతీ విమర్శకు రాజకీయంగా సమాధానం చెప్పడమే మంత్రుల బాధ్యత కాదు. ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించడం, విమర్శల్లో వాస్తవం ఉంటే సరిదిద్దుకోవడం, నిరాధార ఆరోపణలను ఆధారాలతో ఖండించడం మరింత ముఖ్యమైన బాధ్యత. రాజకీయ ప్రతిస్పందనతో పాటు పాలనా పనితీరు కూడా సమానంగా కనిపించాలి.ప్రభుత్వం ఏర్పడి కాలం గడు–స్తున్న కొద్దీ ప్రజల అంచనాలు పెరుగుతాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు ఎంతవరకు జరిగింది? సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతున్నాయా? అభివృద్ధి పనులు నిర్దేశిత గడువుల్లో పూర్తవుతున్నాయా? ప్రజలకు మంత్రులు అందుబాటులో ఉంటున్నారా? వంటి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. కాబట్టి, మంత్రివర్గ విస్తరణను కేవలం పదవుల మార్పుగా కాకుండా, పాలనలో జవాబుదారీతనాన్ని పెంచే అవకాశంగా చూడాలి.

**కీలక శాఖల కేటాయింపుపై ఆసక్తి**

హోం, విద్య, మున్సిపల్ పరిపాలన, వాణిజ్య పన్నులు వంటి కీలక శాఖల కేటాయింపుపైనా రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కొన్ని ముఖ్యమైన శాఖలు ముఖ్యమంత్రి వద్దే ఉండటంతో, విస్తరణ జరిగితే మిగిలిన శాఖల పునర్విభజన ఎలా ఉంటుందనే చర్చ సాగుతోంది. విద్యాశాఖను తన వద్దే ఉంచుకుంటానని ముఖ్యమంత్రి గతంలో ప్రకటించినట్లు పేర్కొంటున్న నేపథ్యంలో, ఆ శాఖ విషయంలో మార్పులు ఉంటాయా లేదా అన్నది కూడా ఆసక్తికర అంశమే.మరోవైపు, మంత్రివర్గ విస్తర–ణతో పాటు డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ వంటి శాసనసభ పదవుల భర్తీ అంశం కూడా ముందుకు రావచ్చు. ఈ పదవులు ఖాళీగా ఉండటంపై ప్రజాప్రతినిధుల్లో ప్రశ్నలు తలెత్తుతున్నట్లు సమాచారం. శాసనసభ వ్యవహారాల నిర్వహణలో ఈ పదవులకు ప్రాధాన్యత ఉన్నందున, వాటి భర్తీపై కూడా పార్టీ నాయకత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.అయితే, పదవులు ఆశిస్తున్న నేతల సంఖ్య, జిల్లాలవారీ ప్రాతినిధ్యం, సామాజిక సమీకరణాలు వంటి అంశాలు నిర్ణయాలను సంక్లిష్టం చేస్తున్నాయి. అందరినీ సంతృప్తిపరచడం సాధ్యం కాకపోయినా, సమతుల్యమైన నిర్ణయాలు తీసుకోవడం పార్టీ నాయకత్వానికి ప్రధాన సవాలుగా నిలుస్తుంది.

**గత విస్తరణలు.. తదుపరి అడుగు ఎటు?**

2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రివర్గంలో జరిగిన మార్పులు, కొత్తగా చోటు కల్పించిన నేతలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ప్రస్తుత విస్తరణ చర్చకు నేపథ్యంగా నిలుస్తున్నాయి. మంత్రి కొండా సురేఖను పదవి నుంచి తొలగించిన పరిణామం సహా, మంత్రివర్గ కూర్పులో వచ్చిన మార్పులు భవిష్యత్ నిర్ణయాలపై ఆసక్తిని పెంచాయి.విస్తరణ ఎప్పుడు జరుగుతుంది? ఎంతమందికి అవకాశం దక్కుతుంది? ప్రస్తుత మంత్రుల్లో ఎవరికి కొనసాగింపు లభిస్తుంది? ఎవరికి కొత్త శాఖలు కేటాయిస్తారు? అనే ప్రశ్నలకు పార్టీ అధిష్ఠానం నిర్ణయం వెలువడిన తర్వాతే సమాధానం లభిస్తుంది. కేంద్ర నాయకత్వం ఇతర రాజకీయ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉండటం వల్ల నిర్ణయ ప్రక్రియ ఆలస్యమవుతోందనే ప్రచారం ఉన్నప్పటికీ, ఖచ్చితమైన తేదీపై అధికారిక స్పష్టత అవసరం.

**పదవుల లెక్కలకు మించి.. ప్రజా తీర్పే అంతిమ ప్రమాణం**

మంత్రివర్గ విస్తరణలో సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం, రాజకీయ విధేయతకు స్థానం ఉండటం సహజం. కానీ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో అంతిమంగా ప్రజల ప్రయోజనాలే ప్రధాన ప్రమాణంగా నిలవాలి. శాఖల నిర్వహణలో పారదర్శకత, ప్రజా సమస్యల పరిష్కారం, అవినీతి ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ, ప్రజాప్రతినిధులతో సమన్వయం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకపోతే, కేవలం ముఖాల మార్పుతో ఆశించిన ఫలితాలు సాధించడం కష్టం.మంత్రుల పనితీరును అంచనా వేయడానికి పార్టీ అంతర్గత సమీక్ష ఉపయోగపడవచ్చు. అయితే, ఆ సమీక్షకు స్పష్టమైన ప్రమాణాలు ఉండాలి. ఫిర్యాదులను ధ్రువీకరించాలి. శాఖల వారీగా సాధించిన ఫలితాలను పరిశీలించాలి. ప్రజలకు ఇచ్చిన హామీల అమలును లెక్కలోకి తీసుకోవాలి. వ్యక్తిగత విభేదాలు, రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాలి.అప్పుడే మంత్రివర్గ విస్తరణ పదవుల పంపిణీగా కాకుండా పాలనా సంస్కరణకు ఒక అవకాశంగా నిలుస్తుంది. కాంగ్రెస్ అధిష్ఠానం ముందున్న అసలు సవాలు కూడా ఇదేఎవరికి పదవి ఇవ్వాలి, ఎవరిని తప్పించాలి అన్న లెక్కలకు మించి, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే పాలనా వ్యవస్థను ఎలా బలోపేతం చేయాలన్నది. రాబోయే విస్తరణలో తీసుకునే నిర్ణయాలు ఆ దిశగా పార్టీ ఎంత ప్రాధాన్యత ఇస్తుందో స్పష్టం చేయనున్నాయి.

# వైద్య పరీక్షల్లో పారదర్శకతే ప్రామాణికం!




పీజీ వైద్య పరీక్షల మూల్యాంకనంలో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత కీలకం. వైద్య విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పరీక్షల్లో మార్కుల నమోదులో వ్యత్యాసాలు ఉన్నాయంటూ తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (టీ–జూడా) చేసిన ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం సమగ్ర సమీక్ష, స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలన్న డిమాండ్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.థియరీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో అనూహ్యంగా విఫలమవుతున్నారని, ఫైనల్ కరెక్షన్, మోడరేషన్ తర్వాత మార్కుల్లో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని టీ–జూడా పేర్కొంటోంది. గాంధీ మెడికల్ కాలేజీ పీడియాట్రిక్ విభాగం పరీక్షల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని ఆరోపించింది. అయితే, ఈ ఆరోపణల వాస్తవాలను నిర్ధారించాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయంపై ఉంది. ఆధారాలతో కూడిన విచారణ లేకుండా ఆరోపణలను నిజమని భావించడం ఎంతవరకు సరికాదో, వాటిని పట్టించుకోకుండా వదిలేయడం కూడా అంతే తప్పు.పీజీ వైద్య విద్యార్థులు క్లినికల్ విధులు, థీసిస్ పరిశోధనలు, పరీక్షల కోసం ఏళ్ల తరబడి శ్రమిస్తారు. అలాంటి విద్యార్థుల భవిష్యత్తు మూల్యాంకన లోపాల వల్ల ప్రభావితమైతే అది వ్యక్తిగత నష్టానికే పరిమితం కాదు; వైద్య విద్యా వ్యవస్థపై విశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తుంది. అందుకే ఎగ్జామినర్ల వారీగా, సబ్జెక్టుల వారీగా ఫెయిల్యూర్ రేట్లను పరిశీలించి, మార్కుల నమోదులో పొరపాట్లు ఉన్నాయా లేదా తేల్చాలి.నిబంధనలకు అనుగుణంగా రీకౌంటింగ్, పారదర్శక రీవాల్యుయేషన్ ప్రక్రియను అమలు చేయాలి. అర్హులైన విద్యార్థులకు గ్రేస్ మార్కుల అంశాన్ని నిబంధనల పరిధిలో పరిశీలించాలి. ఫిర్యాదుల పరిష్కారానికి శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలి.పరీక్షల విశ్వసనీయత అనేది కేవలం ఉత్తీర్ణత శాతంలో కాదు, న్యాయమైన మూల్యాంకనంలో ఉంటుంది. విద్యార్థులకు న్యాయం చేయడం, వైద్య విద్యా ప్రమాణాలను కాపాడటం రెండూ సమాంతరంగా సాగాలి. పారదర్శక ఆడిట్, స్పష్టమైన ఫలితాలు, బాధ్యతాయుతమైన చర్యలే విశ్వవిద్యాలయంపై విద్యార్థుల విశ్వాసాన్ని నిలబెట్టగలవు.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# నేరాలపై ఏఐ నిఘా..!

## పోలీసులకు అత్యాధునిక అస్త్రం!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నేరస్తుడు ఎంతటి వాడైనా, టెక్నాలజీ వాడి ఎన్ని మాయలు చేసినా.. వాటన్నింటినీ చిత్తు చేస్తూ పోలీసులకు ఎదురులేని ఆయుధంగా మారుతోంది సీసీటీఎన్ఎస్ 2 క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ ఫేజ్ 2. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లను ఒకే నెట్‌వర్క్ కిందికి తీసుకొచ్చిన సీసీటీఎన్ఎస్ తొలి దశ అద్భుత ఫలితాలు ఇస్తుండటంతో ఇప్పుడు దానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, బిగ్ డేటా వంటి అత్యాధునిక హంగులు అద్దుతూ సీసీటీఎన్ఎస్ వెర్షన్ 2.0ను అందుబాటులోకి తెస్తున్నారు. పాత వ్యవస్థ కేవలం నేరాల నమోదు, రికార్డుల డిజిటలైజేషన్‌కు మాత్రమే పరిమితం కాగా, రెండో దశ ఏకంగా నేరాలు జరగకముందే పసిగట్టే ప్రిడిక్టివ్ పోలీసింగ్ స్థాయికి భారతీయ పోలీసు వ్యవస్థను తీసుకువెళ్తోంది. ఒక రకంగా ఇది నేరగాళ్ల పాలిట ఏఐ బ్రహ్మాస్త్రంగా నిలవనుంది.

**సీసీటీఎన్ఎస్ 2 అంటే ఏంటి?..**

మునుపటి వ్యవస్థలో డేటాను భద్రపరచడానికి స్థానిక సర్వర్లపై ఆధారపడాల్సి వచ్చేది. కానీ ఈ నూతన వ్యవస్థను పూర్తిగా 'క్లౌడ్ బేస్డ్ ఆర్కిటెక్చర్'పై నిర్మిస్తున్నారు. దీనివల్ల దేశంలో ఏ మూలన ఏ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనా, ఆ సమాచారం క్షణాల వ్యవధిలో దేశవ్యాప్తంగా ఉన్న దర్యాప్తు అధికారులకు, వారి మొబైల్ లేదా ట్యాబ్లెట్లలో ప్రత్యక్షమవుతుంది. నేరం జరిగిన ప్రదేశం నుంచే అధికారులు ఫొటోలు, వీడియోలు, వేలిముద్రలు, సాక్షుల వాంగ్మూలాలను నేరుగా యాప్ ద్వారా క్లౌడ్‌లోకి అప్‌లోడ్ చేయవచ్చు. దీనివల్ల ఫైళ్లు మార్చడం, సాక్ష్యాలు తారుమారు చేయడం అన్నమాటే ఇకపై వినిపించదు.

**కీలకమైన అస్త్రం ఇదే..**

రెండో దశలో పొందుపరుస్తున్న అత్యంత కీలకమైన అస్త్రం 'ఇంటర్ ఆపరేబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్'.. ఐసీజేఎస్. దీని ద్వారా పోలీస్ స్టేషన్లు, కోర్టులు, జైళ్లు, ఫోరెన్సిక్ ల్యాబ్‌లు, ప్రాసిక్యూషన్ విభాగాలు అన్నీ ఒకే వేదికపైకి వస్తాయి. ఒక నేరస్థుడిని అరెస్ట్ చేసినప్పటి నుంచి, చార్జిషీట్ దాఖలు చేయడం, కోర్టు విచారణ, జైలుశిక్ష పడే వరకు కాగితాలతో పనిలేకుండా డిజిటల్ రూపంలోనే మొత్తం ప్రక్రియ వేగంగా సాగిపోతుంది. ఒక ఫోరెన్సిక్ రిపోర్ట్ సిద్ధం కాగానే అది ఆటోమేటిక్‌గా పోలీసులకు, కోర్టుకు ఒకేసారి చేరిపోతుంది. ఇది దర్యాప్తు, న్యాయ ప్రక్రియలో జరిగే జాప్యాన్ని శాశ్వతంగా నివారించనుంది.

**హాట్‌స్పాట్స్‌పై అలర్ట్..**

ఏఐ ఆధారిత డేటా అనలిటిక్స్ సీసీటీఎన్ఎస్ 2కు మరో ప్రధాన ఆకర్షణ. గడిచిన పదేళ్ల నేరాల డేటాను ఏఐ విశ్లేషించి, రాబోయే రోజుల్లో ఏ ప్రాంతంలో, ఏ సమయంలో ఎలాంటి నేరాలు జరగడానికి అవకాశాలు ఉన్నాయో హాట్ స్పాట్స్ ముందే అంచనా వేసి పోలీసులను అప్రమత్తం చేస్తుంది. అలాగే ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ఎఫ్ఆర్ఎస్ అనుసంధానంతో నేరస్థుడు గడ్డం పెంచినా, ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నా, విగ్గులు వాడి వేషం మార్చినా సీసీటీఎన్ఎస్ 2 ఇట్టే పసిగట్టేస్తుంది. అనుమానితుడి ఫొటో తీసి స్కాన్ చేయగానే, దేశవ్యాప్తంగా ఉన్న కోట్ల కొద్దీ పాత నేరస్థుల డేటాబేస్‌తో కేవలం కొన్ని సెకన్లలో పోల్చి చూసి అతని అసలు జాతకం బయటపెడుతుంది.

**నేరస్థులు తప్పించుకోలేరు..**

పోలీసులకే కాకుండా సామాన్య పౌరులకు కూడా ఈ సీసీటీఎన్ఎస్ 2 అద్భుతమైన సేవలను అందించనుంది. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్లు, క్యారెక్టర్ సర్టిఫికెట్లు, అద్దె ఇళ్లలో ఉండేవారి పూర్వాపరాల విచారణ వంటివి రోజుల తరబడి కాకుండా గంటల వ్యవధిలోనే పూర్తయ్యేలా సిటిజన్ పోర్టల్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, తమ కేసు దర్యాప్తు ఏ దశలో ఉందో ట్రాకింగ్ ఐడీ ద్వారా పారదర్శకంగా తెలుసుకునే హక్కును ప్రజలకు కల్పిస్తున్నారు. తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ నేతృత్వంలో త్వరలో రాష్ట్ర పోలీస్ శాఖ ఈ నూతన సాంకేతికతను స్వీకరించేందుకు ఇప్పటికే పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోంది. మొత్తానికి సీసీటీఎన్ఎస్ 2 రాకతో నేర దర్యాప్తు విభాగం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను అందుకోవడమే కాకుండా, నేరస్థులకు ఇక తప్పించుకునే దారి లేదన్న స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది.

# ఢిల్లీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు వార్నింగ్

**ఢిల్లీ :** ఢిల్లీలోని హైకోర్టు సమీపంలో సరైన ఫుట్‌పాత్ లేకపోవడం, క్రాసింగ్ లేకపోవడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఫుట్ పాత్, క్రాసింగ్ ఏర్పాటు చేయాలని లేదంటే తమ న్యాయమూర్తులే హైకోర్టు ముందు ధర్నాకు దిగుతారని అధికారులను హెచ్చరించింది. ప్రాథమిక పాదచారులకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అవ్వడంపై జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె.వి. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.కేవలం కమిటీలు ఏర్పాటు చేయడం సరిపోదని, క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. పని పూర్తికాకపోతే ధర్నా చేస్తామని, పని పూర్తయ్యే వరకు ఆ స్థలాన్ని విడిచిపెట్టేది లేదని హెచ్చరించింది. తదుపరి విచారణ తేదీలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించింది. లేదంటే ఢిల్లీ హైకోర్టు ప్రధాన ద్వారం వద్దకు తమ న్యాయమూర్తులు వచ్చి పని పూర్తి చేసేవరకు తిరిగి ఇంటికి వెళ్లబోమని స్పష్టం చేసింది.సురక్షితమైన నడక మార్గాలు ప్రాథమిక హక్కు అని తెలిపింది. ఈ సందర్భంగా రహదారులపై ఆక్రమణలు లేని, సురక్షితమైన ఫుట్ పాత్‌లు ఉండేలా చూడాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోర్టు ఆదేశించింది. పాదచారుల భద్రతపై తన ఇటీవలి ఆదేశాలలో, మెటారు వాహనాల రాకపోకల కంటే పాదచాదుల హక్కులకే ప్రధాన్యత ఇవ్వాలని నొక్కి చెప్పింది. పాదచారుల హక్కులే ప్రధానమైనవని, అవి మోటారు వాహనాల రాకపోకల కంటే ముఖ్యమైనదని స్పష్టం చేసింది.

# ప్రాణం తీసిన న్యూడుల్స్..

**నోయిడా :** ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని ఓవైపు వైద్యులు, ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నా.. ఒకట్రెండు సార్లు తింటే ఏమవుతుందిలే అన్న ధోరణిలో ఉంటున్నారు ప్రజలు. తాజాగా.. ఓ కుటుంబంలో ఐదుగురు.. న్యూడుల్స్ తిని నిద్రపోగా.. నిద్రలోనే మృత్యుఒడికి చేరుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రేటర్ నోయిడాలో ఈ ఘటన చోటుచేసుకుంది. రబుపుర ప్రాంతానికి చెందిన కుటుంబం అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోగా.. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతులను మహేష్ (37), లలిత (35), లడ్డు (11), మిష్టి (7), సాక్షాత్ (3)లుగా గుర్తించారు. గతరాత్రి వారంతా నూడుల్స్ తిని, టీ తాగి పడుకున్నట్లుగా మహేష్ తల్లి పోలీసులకు చెప్పారు. దీంతో ఫుడ్ పాయిజన్ అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. వారి మరణాలకు గల అసలు కారణం పోస్టుమార్టమ్ రిపోర్ట్ వచ్చాకే తెలుస్తుందని తెలిపారు. మరోవైపు ఫుడ్ సేఫ్టీ అధికారులు



సైతం రంగంలోకి దిగారు. మహేష్ కుటుంబం చివరిగా నూడుల్స్ తిన్న శాంపిల్స్ ను సేకరించి టెస్టులకు పంపారు.కొన్నినెలల క్రితం బిర్యానీ తిని, ఆ తర్వాత పుచ్చకాయ తిన్న కాసేపటికే ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించిన విషయం తెలిసిందే. మహారాష్ట్రలో ఈ ఘటన జరగ్గా.. గ్రేటర్ నోయిడాలో జరిగిన తాజా సంఘటన ఆ మరణాలను గుర్తుచేస్తోంది. వారంతా ఫుడ్ పాయిజనింగ్ కారణంగానే మరణించినట్లు పోస్టుమార్టం రిపోర్టుల్లో తేలింది.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కలకలం..

**శంషాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (శంషాబాద్ ఎయిర్‌పోర్ట్) మరోసారి బాంబు బెదిరింపుతో ఉలిక్కిపడింది. అహ్మదాబాద్ నుంచి శంషాబాద్‌కు వస్తున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానానికి బాంబు బెదిరింపు రావడంతో ఎయిర్‌పోర్ట్ అధికారులు, భద్రతా సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. అందిన సమాచారం ప్రకారం.. అహ్మదాబాద్ నుంచి బయలుదేరిన ఇండిగో విమానంలో బాంబు ఉందంటూ హెచ్చరికలు అందడంతో ఎయిర్‌పోర్ట్ అథారిటీకి సమాచారం చేరవేశారు. దీంతో వెంటనే అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్ బలగాలు, ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ సిబ్బంది రంగంలోకి దిగారు. విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయిన వెంటనే భద్రతా ప్రోటోకాల్స్ ప్రకారం దానిని సురక్షిత ప్రాంతమైన ఐసోలేషన్ బే కు తరలించారు.అనంతరం బాంబ్ స్క్వాడ్ , డాగ్ స్క్వాడ్ సిబ్బంది సహాయంతో విమానంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల లగేజీని, విమానంలోని ప్రతీ మూలను పరిశీలిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



## జెండా పడితే అరెస్ట్ చేస్తారా?

**ఢిల్లీ :** ఎన్నికల ప్రధాన కమిషనరు (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండు చేస్తూ సీజేపీ ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన తిరంగా మార్చ్ పై పోలీసుల నిర్భందం, ఆంక్షలపై ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ రియాక్ట్ అయ్యారు. దేశభక్తని చాటడానికి హర్ ఘర్ తిరంగ చేపట్టాలని గతంలో చెప్పిన మీరే ఇప్పుడు తిరంగ జెండాను పట్టుకున్న యువతని ఎందుకు అరెస్టు చేస్తున్నారు?ఈ కన్ఫ్యూజన్ ఏంటి అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు ఓ వీడియో రిలీజ్ చేసిన ఆయన.. తాజా ఆందోళనల వెనుక ప్రభుత్వాన్ని కూలదోయాలనే కుట్ర దాగి ఉందంటూ బీజేపీ చేస్తున్న విమర్శలను ఖండించారు.

**ఓట్లద్వారానే ప్రభుత్వం మార్పు:**

ప్రభుత్వాలను మార్చాలంటే ఓటు ద్వారానే సాధ్యం అని అందువల్ల ఎస్ఐఆర్ ద్వారా ప్రజల ఓట్లు తొలగించవద్దన్నారు. తొలగించిన ఓట్లు తిరిగి వెనక్కి ఇవ్వాలన్నారు. ఇది గాంధీ దేశమని ఇక్కడ శాంతియుత ఆందోళనుల ఉంటాయన్నారు. ప్రజల ఓట్లు లాక్కోవడం సరైన పద్ధతి కాదని చెప్పారు. యువతను, పిల్లలను ఇబ్బంది పెడితే ప్రజలే తగిన సమాధానం చెబుతారన్నారు. యువతపై దాడులు చేస్తే వారు వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయరని గతంలో రైతులపై దాడి చేసినందుకు వారు బీజేపీకి ఓటు వేయలేదన్నారు. అందుకే 400 సీట్ల నినాదాన్ని కేవలం 240 కే పరిమితం అయిందన్నారు. అందువల్ల యువతని ఇబ్బందులకు గురి చేయవద్దని కేంద్రానికి సలహా ఇచ్చారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతే కీలకం

**ఆంధ్రప్రదేశ్ :** స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతే కీలకం అని సీఎం చంద్రబాబు అన్నారు. మున్సిపల్ ఎన్నికల వేళ కూటమి నేతలతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సమన్వయంతో వెళ్లాలని సూచించారు. నామినేషన్లకు కూటమి నేతలు అభ్యర్థులతో కలిసి వెళ్లాలని చెప్పారు. శుక్రవారం జరిగిన ఘటనల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు.స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనకు సమిష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే స్థానిక ఎన్నికల టికెట్ల కేటాయింపులో చాలా మంది అభ్యర్థులు, కార్యకర్తలు నిరాశ చెందుతున్నారు. కూటమి పొత్తులో భాగంగా మూడు పార్టీలలో ఒకరికి టికెట్ కేటయించడం వల్ల మిగితా వాళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల రెబల్స్ గా బరిలో దిగుతున్నారు. ముఖ్యంగా జనసేనలో కార్యకర్తలు, పోటీకి సిద్ధమైన అభ్యర్థులు టికెట్లు దక్కకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతూ బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు.

# ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ హెచ్చరిక..

**ఢిల్లీ :** మరోసారి పెట్రోల్ ధరలు పెరగనున్నాయా? డీజిల్ ధరలపై వడ్డింపు తప్పదా? ఇంకో వైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా మరోసారా వడ్డీ రేట్లను పెంచడానికి సిద్ధమైందా? అంటే.. అవును అనే అంచనాలు ఇప్పుడు అందరినీ టెన్షన్ పెడుతున్నాయి.. నవంబర్‌లో దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ అంచనా వేసింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు ఇంధన ధరలపై ప్రభావం చూపవచ్చని పేర్కొంది. వచ్చే ఏడాది పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, ఎన్నికల ప్రచారం ఊపందుకునేలోపే ఇంధన ధరల పెంపునకు అవకాశం ఉండవచ్చని విశ్లేషించింది. అయితే, ధరల పెంపుపై అధికారిక ప్రకటన వెలువడినట్లు సమాచారం లేదు.బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ ముఖ్య ఆర్థికవేత్త అలెగ్జాండ్రా హర్మన్ ప్రసాద్ నవంబర్‌లో పెట్రోల్ ధరలు పెరిగే అవకాశాన్ని ప్రస్తావించారు. వచ్చే ఏడాది ఏడు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇంధన ధరల నిర్ణయం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకోవచ్చని నివేదిక విశ్లేషించింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్ సహా ఐదు రాష్ట్రాల్లో మార్చి నుంచి మే మధ్య ఎన్నికలు జరిగే అవకాశం ఉందని పేర్కొంది.

**ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం**

ఇంధన ధరలను పెంచితే దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెరగవచ్చని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ అంచనా వేసింది. మే నెలలో చేపట్టిన ఇంధన ధరల పెంపుతో పోలిస్తే, తదుపరి పెంపు దాదాపు సగం స్థాయిలో ఉండవచ్చని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో 2026 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 6.2 శాతానికి, 2027 జనవరి-మార్చి త్రైమాసికంలో 6.5 శాతానికి చేరవచ్చని నివేదిక అంచనా వేసింది. అదే జరిగితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్దేశించిన 2 నుంచి 6 శాతం ద్రవ్యోల్బణ లక్ష్య పరిధిని దాటే ప్రమాదం ఉంటుంది.

**ఆర్‌బీఐ అంచనాలకు భిన్నంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు**

ఆర్‌బీఐ తన ద్రవ్య విధాన సమీక్షలో 2026 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికి ద్రవ్యోల్బణం 6 శాతంగా, 2027 జనవరి-మార్చి త్రైమాసికానికి 5.7 శాతంగా ఉండవచ్చని అంచనా వేసినట్లు నివేదిక పేర్కొంది. అయితే, వచ్చే ఏడాది ధరల ఒత్తిళ్లు పెరుగుతాయని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ భావిస్తోంది. మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉండవచ్చని అంచనా వేయగా, ఆర్‌బీఐ అంచనా 5.2 శాతంగా ఉంది.

**రెపో రేటు పెంపునకు అవకాశం**

ద్రవ్యోల్బణం అంచనాలకు మించి పెరిగితే ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉందని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ విశ్లేషించింది. నవంబర్‌లో ఇంధన ధరల పెంపు లేకపోతే, రాబోయే త్రైమాసికాలకు సంబంధించిన ద్రవ్యోల్బణ అంచనాలు 10 నుంచి 30 బేసిస్ పాయింట్ల మేర తగ్గవచ్చని పేర్కొంది. అయినప్పటికీ, ధరల ఒత్తిళ్లు కొనసాగితే డిసెంబర్, ఫిబ్రవరి ద్రవ్య విధాన సమీక్షల్లో రెపో రేటును 25 నుంచి 50 బేసిస్ పాయింట్ల వరకు పెంచాల్సిన పరిస్థితి రావచ్చని అంచనా వేసింది.

**రూపాయి స్థిరత్వంపైనా చమురు ధరల ప్రభావం**

కరెన్సీ మార్కెట్‌లో రూపాయి ఒడిదుడుకులను నియంత్రించేందుకు ఆర్‌బీఐ ఇటీవల తీసుకున్న చర్యలు కొంతవరకు సహాయపడవచ్చని హర్మన్ ప్రసాద్ అభిప్రాయపడినట్లు నివేదిక తెలిపింది. అయితే, అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు అధికంగా ఉండటం, విదేశీ నిధుల ప్రవాహంపై ఒత్తిళ్లు కొనసాగడం వంటి అంశాలు రూపాయిపై ప్రభావం చూపవచ్చని పేర్కొంది. ఆర్‌బీఐ జోక్యం ఒక్కటే రూపాయికి దీర్ఘకాలిక స్థిరత్వాన్ని అందించలేదని విశ్లేషించింది. మొత్తంగా, నవంబర్‌లో ఇంధన ధరల పెంపు జరిగితే దాని ప్రభావం రవాణా ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణంపై పడే అవకాశం ఉంది. ద్రవ్యోల్బణం పెరిగితే రుణాలపై వడ్డీ రేట్ల విషయంలోనూ మార్పులు రావచ్చు. అయితే, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, రెపో రేటు మార్పులపై తుది నిర్ణయాలు సంబంధిత అధికారిక ప్రకటనలపై ఆధారపడి ఉంటాయి.

# పేదల బియ్యం గోల్‌మాల్!

**నాగర్ కర్నూల్,ఫ్లాష్ ఇండియా :** రైతుల కష్టార్జితాన్ని సేకరించి పేద ప్రజల ఆకలి తీర్చాల్సిన ప్రభుత్వ ధాన్యం అక్రమార్కుల జేబులు నింపుతోంది. కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) పేరిట కేటాయించిన వేల టన్నుల ప్రభుత్వ ధాన్యం రైస్ మిల్లుల నుంచి బహిరంగ మార్కెట్లకు తరలిపోయింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని రెండు ప్రముఖ రైస్ మిల్లుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఈ దిగ్భ్రాంతికర నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఏకంగా రూ.29.27 కోట్ల విలువైన 12,530 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వల్లో కొరత తేలడం జిల్లా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది.

**మంతటిలో 94 వేల బస్తాలు స్వాహా!**

నాగర్‌కర్నూల్ మండలం మంతటి సమీపంలోని మహాలక్ష్మి పార్‌బాయిల్డ్ ఇండస్ట్రీస్‌లో సివిల్ సప్లైస్, విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కేఎంఎస్ 2022-23, 2024-25, 2025-26 సీజన్లకు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ కోసం ఇచ్చిన ధాన్యంలో 3,774.818 మెట్రిక్ టన్నుల (94,370 బస్తాలు) కొరత ఉన్నట్లు పంచనామాలో నిర్ధారించారు. బహిరంగ మార్కెట్లో దీని విలువ సుమారు రూ.9.68 కోట్లుగా లెక్కగట్టారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ దండు రాజేందర్ ఫిర్యాదు మేరకు మిల్లు నిర్వాహకులు ఆకుతోట సాయిబాబు, సుదర్శన్‌లతో పాటు మొత్తం 13 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం సాయంత్రం ఉప్పునుంతల మండలం ఉప్పరి పల్లి గ్రామం లోని ఏఎమ్ఆర్ రైస్ మిల్‌లో తనిఖీలు చేసి ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని చెప్పడం గమనార్హం.

**తాడూరులో అంతకు రెట్టింపు దోపిడీ!**

మంతటి కంటే ముందే తాడూరు మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో అధికారులు తనిఖీలు చేపట్టగా అక్కడ అంతకు రెట్టింపు స్థాయిలో అక్రమాలు బయటపడ్డాయి. ఈ మిల్లులో నిల్వ ఉండాల్సిన ధాన్యంలో ఏకంగా 8,755.883 మెట్రిక్ టన్నుల మేర భారీ వ్యత్యాసాన్ని గుర్తించారు. దీని విలువ దాదాపు రూ.19.59 కోట్లుగా తేలింది. మిల్లు మేనేజింగ్ పార్ట్‌నర్ పొనుగంటి సుధాకర్‌రావుతో పాటు మరో నలుగురు భాగస్వాములపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**మూడేళ్లుగా పర్యవేక్షణ ఏదీ?**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిల్లులకు అప్పగించిన ధాన్యం, మిల్లింగ్ చేసిన పరిమాణం, తిరిగి ప్రభుత్వానికి అప్పగించిన బియ్యం లెక్కలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయడంతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో భౌతిక తనిఖీలు నిర్వహించాలి. అయితే 2022-23 సీజన్ నుంచే నిల్వల్లో భారీగా వ్యత్యాసాలు వస్తున్నప్పటికీ, మూడేళ్లపాటు అధికారులు ఎందుకు గుర్తించలేకపోయారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత భారీ పరిమాణంలో ధాన్యం బహిరంగ మార్కెట్లకు తరలిపోతుంటే స్థానిక అధికారులు చోద్యం చూశారా లేక వారి అండదండలతోనే ఈ దందా సాగిందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**సమాచార గోప్యతపై విమర్శలు..?**

తనిఖీలకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచడం, మీడియాకు అధికారిక సమాచారం ఇవ్వకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం ఉప్పునుంతల మండలం ఉప్పరిపల్లిలోని ఏఎంఆర్ మిల్లులో నామమాత్రపు తనిఖీలు చేపట్టి అంతా సవ్యంగానే ఉందని సరిపెట్టుకోవడం కూడా అనుమానాలకు తావిస్తోంది. కోట్లాది రూపాయల ప్రజాధనం పక్కదారి పట్టిన ఈ వ్యవహారంలో కేవలం మిల్లర్లపై ఎఫ్ఐఆర్‌ల నమోదుతో సరిపెట్టకుండా, శాఖాపరమైన వైఫల్యాలపై లోతైన విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి జరిగిన రూ.29.27 కోట్ల నష్టాన్ని రికవరీ చేసేందుకు నిందితుల ఆస్తులను వెంటనే జప్తు చేయాలని ప్రజలు, రైతు సంఘాలు కోరుతున్నాయి. మిల్లుల నిర్వాహకుల పాత్రతో పాటు, ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, బియ్యం సరఫరాను పర్యవేక్షించాల్సిన అధికారుల బాధ్యతలపైనా సమగ్ర విచారణ జరపాలని, ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని రికవరీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# యువతకు డీజీపీ పిలుపు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మాదక ద్రవ్యాల నిరోధానికి ఎన్నో చర్యలు తీసుకున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపుతున్నామని పేర్కొన్నారు. 2029 డిసెంబర్ 31లోగా డ్రగ్స్ రహిత దేశంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. అందుకోసం ఎన్నో కార్యక్రమాలు, వ్యూహాలు మనం చూడబోతున్నామని తెలిపారు. మాదక ద్రవ్యాల హానికరమని.. ఇవి దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్నాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.ఐదు ఆరు రోజుల క్రితం వివిధ రాష్ట్రాల్లో ఈ ర్యాలీ ప్రారంభమైందని వెల్లడించారు. ఈ ర్యాలీలో ఐదు రాష్ట్రాల వారు పాల్గొన్నారని అన్నారు.ఐదు రోజుల తర్వాత ర్యాలీ నేడు హైదరాబాద్ చేరుకుందని తెలిపారు.తెలంగాణ నుంచి ఏడుగురు మోటార్ సైకిల్ ర్యాలీలో జాయిన్ అవుతారని చెప్పారు. అక్టోబర్ 30వ తేదీన ఈ ర్యాలీ గుజరాత్ రాష్ట్రం కేవాడియా చేరుకుంటుందని తెలిపారు. ఆరోజు కెవాడియాలో జరిగే సర్దార్ వల్లభాబాయ్ పటేల్ జన్మదిన వేడుకల్లో పాల్గొంటారని అన్నారు. భారత దేశంలో ఎన్నో సంస్కృతి సంప్రాదాయాలు ఉన్నాయని తెలిపారు. మనం అందరం భారతీయులమని చాటి చెప్పేందుకే ఈ ఏక్తా దివస్ ర్యాలీ నిర్వహిస్తున్నామని వివరించారు. నషా ముక్త్ భారత్ థీమ్ పేరుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు.కాగా, రాష్ట్రీయ ఏక్తా దివస్--2026 సందర్భంగా ఈరోజు (శనివారం) ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో జాతీయ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణలో మాదకద్రవ్యాల నిర్మూలన, డ్రగ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ జరగనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీజీపీ సీవీ ఆనంద్ హాజరయ్యారు. రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా నిర్వహించనున్న జాతీయ మోటార్‌సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. డ్రగ్స్ దుష్ప్రభావాలపై యువతకు, విద్యార్థులకు అవగాహన కల్పించడంపై ఈగల్ ఫోర్స్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారంలో భాగంగా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గచ్చిబౌలిలో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం చేపట్టారు.మెహదీపట్నం మీదుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఈ ర్యాలీ చేరుకోనుంది. సంగారెడ్డి జిల్లా కందిలోని



ఐఐటీలో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించనున్నారు. పటాన్‌చెరు మీదుగా ఐఐటీ కందికి మోటార్‌సైకిల్ ర్యాలీ చేరుకోనుంది. అక్కడి నుంచి కర్ణాటకలోని జహీరాబాద్ ఉమ్మాబాద్ వైపు ర్యాలీ కొనసాగనుంది. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈగల్ ఫోర్స్ ప్రధాన ఉద్దేశంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంపై దృష్టిసారించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సమాజమంతా ఏకం కావాలని ఈగల్ ఫోర్స్ అధికారులు సందేశమిచ్చారు. జాతీయ ఐక్యత, సామాజిక బాధ్యత, మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటమనే అంశాలతో ఈగల్ ఫోర్స్ అధికారులు ర్యాలీ నిర్వహిస్తున్నారు.

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

**మహిళలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన ఇరుగురాల సుగుణ**
**మహిళల ఐకమత్యానికి, ప్రకృతి ఆరాధనకు బతుకమ్మ పండుగ ప్రతీక**



**పెద్దపల్లి జిల్లా, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఎలిగేడు మండల ప్రజలతో పాటు తెలంగాణ ఆడపడుచులందరికీ ధూళికట్ట 12వ వార్డు సభ్యురాలు ఇరుగురాల సుగుణ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో బతుకమ్మ పండుగకు విశిష్టమైన స్థానం ఉందని, ప్రకృతిని దైవంగా భావిస్తూ వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి భక్తిశ్రద్ధలతో పూజించడం మన సంప్రదాయమని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఐకమత్యాన్ని పెంపొందించడంతో పాటు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజల మధ్య ఆప్యాయతలు, అనుబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఇరుగురాల సుగుణ అన్నారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తితో, ఉత్సాహంగా తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారని, రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి సంప్రదాయ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకోవడం తెలంగాణ ప్రత్యేకత అని తెలిపారు. ప్రకృతిలో లభించే పూలను పూజించడం ద్వారా ప్రకృతి పట్ల గౌరవం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతాయని పేర్కొన్నారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు వాటి విశిష్టతను తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళలందరూ కులమతాలకు అతీతంగా ఐక్యంగా, సోదరీభావంతో కలిసి మెలిసి బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆమె కోరారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, కుటుంబ సభ్యులందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సద్దుల బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని, ఆనందాన్ని నింపాలని, ఎలిగేడు మండలంలోని ప్రతి కుటుంబానికి మంచి జరగాలని కోరుకుంటూ ధూళికట్ట 12వ వార్డు సభ్యురాలు ఇరుగురాల సుగుణ మరోసారి మహిళలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# సీఎం సొంత జిల్లాలోనే జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కష్టాలు!

**పెండింగ్ కార్డులు వెంటనే మంజూరు చేయాలి.. వివక్షకు తావివ్వొద్దు**
**మీడియా అక్రిడిటేషన్ కమిటీ నాలుగో సమావేశం నిర్వహించాలి - టిడబ్ల్యూజేఎఫ్ డిమాండ్**



**మహబూబ్‌నగర్ ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న మీడియా అక్రిడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని, అర్హులైన జర్నలిస్టుల పట్ల వివక్ష చూపడం తగదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్ ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గండీటి నరసింహులు, జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ మహారాజ్, కోశాధికారి ఏముల నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ నాలుగో సమావేశాన్ని తక్షణమే నిర్వహించాలని కోరారు. ఇప్పటికే మూడుసార్లు సమావేశాలు నిర్వహించినప్పటికీ పలువురు సీనియర్ జర్నలిస్టులకు కార్డులు మంజూరు కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార శాఖ అధికారుల నిర్లక్ష్యం, జాప్యం కారణంగా దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. చిన్నా, పెద్దా పత్రికలు, ఛానళ్లనే తేడా లేకుండా అర్హులందరికీ కార్డులు మంజూరు చేయాలని, ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల పట్ల వివక్ష ఆరోపణలపై విచారణ జరపాలని కోరారు.

**సీఎం సొంత జిల్లాలోనే ఈ పరిస్థితి దురదృష్టకరం**

రాష్ట్రంలోని 32 జిల్లాల్లో దాదాపు 99 శాతం అక్రిడిటేషన్ కార్డులు జారీ కాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాగా పేర్కొంటున్న మహబూబ్‌నగర్‌లో ఇంకా సుమారు 200 మందికి కార్డులు మంజూరు కావాల్సి ఉందని నాయకులు తెలిపారు. ఈ నెల 7న ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించామని, అర్హులందరికీ కార్డులు జారీ చేయడమే సమస్యకు సరైన పరిష్కారమని పేర్కొన్నారు.

**బస్సు పాసుల గడువు పొడిగించాలి**

పాత అక్రిడిటేషన్ కార్డులపై జారీ చేసిన బస్సు పాసుల గడువు అక్టోబర్ 15తో ముగిసినందున, కొత్త కార్డులు అందుబాటులోకి వచ్చే వరకు పాత కార్డుదారుల బస్సు పాసుల గడువును పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**సీనియర్ జర్నలిస్టులకు ప్రత్యేక సౌకర్యాలు**

ఫ్రీలాన్స్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కోటాను ఉమ్మడి పది జిల్లాల కేంద్రాలకు విస్తరించాలని, 25 ఏళ్లకు పైగా జర్నలిజంలో కొనసాగుతున్న సీనియర్ జర్నలిస్టులకు ఫ్రీలాన్స్ కేటగిరీలో కార్డులు ఇచ్చేలా నిబంధనలు సవరించాలని డిమాండ్ చేశారు. అలాగే 2001--2014 తెలంగాణ ఉద్యమ కాలంలో జర్నలిజం ద్వారా ఉద్యమానికి సేవలందించిన జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# నల్గొండ మెడికల్ కాలేజీలో పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

**ఈ నెల 24 వరకు దరఖాస్తుల స్వీకరణ.. రెండు కోర్సుల్లో 60 సీట్లు**

**నల్గొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి రెండేళ్ల పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. తెలంగాణ పారామెడికల్ బోర్డు (TGPMB) నోటిఫికేషన్ నంబర్ 152 ప్రకారం ఈ ప్రవేశాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**60 సీట్లు అందుబాటులో..**

డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ కోర్సులో 30 సీట్లు, డిప్లొమా ఇన్ డయాలసిస్ టెక్నీషియన్ కోర్సులో మరో 30 సీట్లు ఉన్నాయని వెల్లడించారు.

**ఈ నెల 24 చివరి తేదీ**

అక్టోబర్ 14న నోటిఫికేషన్ విడుదల కాగా, ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అర్హులైన అభ్యర్థులు తెలంగాణ పారామెడికల్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ www.tgpmb.telangana.gov.in నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువపత్రాలు, ప్రాసెసింగ్ ఫీజును నగదు రూపంలో జతచేసి నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో నేరుగా సమర్పించాలని ప్రిన్సిపాల్ సూచించారు. అర్హతలు, ఇతర నిబంధనలు, పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

# కోర్టు ప్రాంగణంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**రామన్నపేట మండలం ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలతో అలంకరించిన బతుకమ్మలతో కోర్టు ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సమితి చైర్మన్,జి.సబిత హాజరయ్యారు. అలాగే ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, ఎస్. షిరీష , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, వి.రత్నకుమారి ,సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి, డి.సత్తయ్య పాల్గొన్నారు. ఈ వేడుకల్లో రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఏ.మజీద్ బార్ అసోసియేషన్ సభ్యులు,న్యాయస్థాన సిబ్బంది, పోలీసు అధికారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి,పూల పండుగ విశిష్టతను చాటుతూ అందరూ కలిసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను ఈ సందర్భంగా చాటి చెప్పారు. న్యాయమూర్తులు,న్యాయవాదులున్యాయస్థాన సిబ్బంది, పోలీసు అధికారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనడం ద్వారా పరస్పర స్నేహభావం,ఐకమత్యం, సోదరభావం మరింత బలపడింది. ఈ వేడుకలు ఆహ్లాదకరమైన వాతావరణంలో, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలిచాయి. అని తెలిపారు.

# లో-వోల్టేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

**చర్లపల్లి, బోయలకుంట గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై అధికారులకు వినతి**



**మహబూబ్ నగర్ జిల్లా/జడ్చర్ల, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆదేశాల మేరకు, సర్పంచ్ లక్ష్మమ్మ వెంకటరమణ సూచనతో చర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చర్లపల్లి, బోయలకుంట గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ నాయకులు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తరచూ ఎదురవుతున్న లో-వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని, నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. బోయలకుంట గ్రామంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు, గ్రామాల్లో వేలాడుతున్న లూజ్ విద్యుత్ వైర్లను సరిచేసి ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలని ఈఈ, ఏఈ అధికారులను కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించి, అవసరమైన చర్యలు చేపట్టాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రామ్ చందర్, కాంగ్రెస్ నాయకులు జి. వెంకటరమణ, తిరుపతయ్య, శ్రీశైలం, లడ్డు, నరేందర్ గౌడ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ల కల సాకారం.. రూ.2.10 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం








**నల్లగొండ జిల్లా / చింతపల్లి పీఏపల్లి , ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** పీఏ పల్లి మండలం మేడారం గ్రామ పరిధిలోని రంగారెడ్డి గూడెంలో రూ. 2.10 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శనివారం సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించి, పీఏ పల్లి మండలానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రంగారెడ్డి గూడెం ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నది స్థానిక ప్రజలు, రైతుల పదేళ్ల కల అని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కల సాకారమైందని పేర్కొన్నారు. నూతన సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో పరిసర ప్రాంతాల రైతులకు విద్యుత్ సరఫరా మెరుగుపడటంతో పాటు, లో-వోల్టేజీ, అధిక లోడ్ సమస్యలు తగ్గే అవకాశం ఉందన్నారు. విద్యుత్ సమస్యల కారణంగా రైతులు పంట నష్టపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని సూచించారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రైతుల పంట పొలాలకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అధికారులు బాధ్యతగా పనిచేయాలని స్పష్టం చేశారు.

**మహిళా సంఘాలకు భవనం ఎంతో ఉపయోగకరం**

అనంతరం నూతన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళా సంఘాల సమావేశాలు, పొదుపు, రుణాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలపై చర్చించేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగుతూ ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు**

పీఏ పల్లి మండలానికి చెందిన కళ్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా, మహిళా సంఘాలకు అవసరమైన వసతుల కల్పన, పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలవడం ప్రభుత్వ ప్రాధాన్యతలని ఎమ్మెల్యే తెలిపారు.

**పలువురు నాయకులు, అధికారులు హాజరు**

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, నెర్మటి సతీష్ రెడ్డి, ఏవీ రెడ్డి, సత్యం రెడ్డి, కుక్కల గోవర్ధన్ రెడ్డి, ఎలూగూరి జయమ్మ, భాస్కర్ రెడ్డి, గొంగడాల వెంకటయ్య, రాగం అంజయ్య, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మావిళ్ల లక్ష్మీనారాయణ యాదవ్, ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, మద్దిమడుగు రామస్వామి, కొర్ర రాంసింగ్, మండల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# డిండి ప్రాజెక్టు భూ నిర్వాసిత రైతులకు పరిహార చెక్కుల పంపిణీ



**నల్లగొండ జిల్లా/ చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** డిండి ప్రాజెక్టు నిర్మాణం కోసం భూసేకరణలో భాగంగా తమ భూములను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం తరఫున అందాల్సిన పరిహారాన్ని చెల్లించే ఉద్దేశంతో చింతపల్లి మండల కేంద్రంలో శనివారం పరిహార చెక్కులను పంపిణీ చేశారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందించి, వారి ఆర్థిక నష్టాన్ని కొంతమేర భర్తీ చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. భూసేకరణ ప్రక్రియలో భాగంగా అర్హులైన రైతులకు పరిహారం అందజేయడం ద్వారా వారికి న్యాయం చేయడమే ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉద్దేశం. ఈ కార్యక్రమంలో భూసేకరణ అధికారి (LAO) వనజరాణి, డీటీ మదర్ హుస్సేన్, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ బాలురాజు, సీనియర్ అసిస్టెంట్ శేఖర్ పాల్గొన్నారు.

# దుర్గామాత పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో శనివారం నిర్వహించిన దుర్గామాత పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి సహకారంతో,ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ నిధులతో నిర్మించిన దుర్గామాత ఆలయ షెడ్డును ప్రారంభించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్సీ కి గ్రామస్థులు,భక్తులు సంప్రదాయ నృత్యాలతో ఘనస్వాగతం పలికారు. భక్తుల కోలాహలం,అమ్మవారి నామస్మరణల మధ్య గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం షెడ్డును ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు,ఆలయ అభివృద్ధికి సహకరించిన నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేక సైదులు,ఉప సర్పంచ్ సుదర్శన్ రెడ్డి,రవీందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జానారెడ్డి,గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి నూతన ఎస్ఐగా ఎన్.ధర్మ బాధ్యతలను స్వీకరణ..



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** దామరచర్ల మండల పరిధిలోని వాడపల్లి పోలీస్ స్టేషన్ కు నూతన ఎస్ఐగా వచ్చినటువంటి ఎన్.ధర్మ శనివారం నాడు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు,జూదం,అక్రమ మద్యం,పిడిఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ ఇంచార్జ్ ఎస్ఐగా పనిచేసినటువంటి సైదులు విఆర్ కు బదిలీ కావడం జరిగింది.

# 100 బంతుల్లో 151 పరుగులతో విధ్వంసం..



భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ చిన్న కుమారుడు అన్వయ్ ద్రవిడ్ అండర్-19 క్రికెట్‌లో అదరగొట్టాడు. వినూ మంకడ్ ట్రోఫీ ఎలైట్ టోర్నీలో గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో 17 ఏళ్ల అన్వయ్ కేవలం 100 బంతుల్లోనే 151 పరుగులు చేసి కర్ణాటకకు అద్భుత విజయాన్ని అందించాడు. అతడి మెరుపు ఇన్నింగ్స్‌తో కర్ణాటక అండర్-19 జట్టు ఐదు వికెట్ల తేడాతో గెలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. ఈ ఇన్నింగ్స్‌లో అన్వయ్ 20 ఫోర్లు, మూడు సిక్సర్లు బాదాడు.

**భారీ లక్ష్యాన్ని ఛేదించిన కర్ణాటక**

అక్టోబర్ 16న విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ 50 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది. సమీర్ భండారి 88 బంతుల్లో అజేయంగా 119 పరుగులు చేయగా, యశ్ పంజ్‌వానీ కేవలం 57 బంతుల్లో అజేయంగా 106 పరుగులు సాధించాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు అజేయంగా 217 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో గుజరాత్ భారీ స్కోరు సాధించింది. వీజేడీ (ఎజీణ) పద్ధతి ప్రకారం కర్ణాటకకు 352 పరుగుల సవరించిన లక్ష్యం నిర్దేశించారు. ఈ భారీ లక్ష్య ఛేదనలో అన్వయ్ ద్రవిడ్, ధ్రువ్ కృష్ణన్ కీలక పాత్ర పోషించారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 203 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను కర్ణాటక వైపు తిప్పారు. ధ్రువ్ కృష్ణన్ కూడా 100 బంతుల్లో 131 పరుగులతో అద్భుతంగా రాణించాడు. చివరకు కర్ణాటక 45.3 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

**టోర్నీలో అన్వయ్‌కు రెండో సెంచరీ**

ప్రస్తుత వినూ మంకడ్ ట్రోఫీలో అన్వయ్ వరుసగా రాణిస్తున్నాడు. అంతకుముందు చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో 62 బంతుల్లో 104 పరుగులు చేశాడు. ఆ మ్యాచ్‌లో కర్ణాటక 100 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఢిల్లీతో జరిగిన మరో మ్యాచ్‌లో కేవలం 41 బంతుల్లో 85 పరుగులు సాధించి తన దూకుడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఇప్పుడు గుజరాత్‌పై 151 పరుగులు చేయడంతో ఈ టోర్నీలో రెండో సెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు.

**కెప్టెన్‌గా, వికెట్ కీపర్‌గా కీలక బాధ్యతలు**

కర్ణాటక అండర్-19 జట్టుకు అన్వయ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. బ్యాటింగ్‌తో పాటు వికెట్ కీపింగ్ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నాడు. చిన్న వయసులోనే జట్టుకు నాయకత్వం వహిస్తూ కీలక ఇన్నింగ్స్‌లు ఆడటం విశేషం. గత ఏడాది నవంబర్‌లో శ్రీలంక పర్యటన సందర్భంగా అఫ్గానిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత అండర్-19 జట్టుకు అరంగేట్రం చేశాడు. ఇక, అంతర్జాతీయ యువ క్రికెట్‌లోనూ అన్వయ్ తన ప్రతిభను చాటుకున్నాడు. జూలైలో శ్రీలంక పర్యటనలో జరిగిన యూత్ వన్డే సిరీస్ రెండో మ్యాచ్‌లో 67 బంతుల్లో 87 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో తొమ్మిది ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన వర్షం కారణంగా కుదించిన యూత్ వన్డే మ్యాచ్‌లో 18 బంతుల్లో 38 పరుగులు సాధించాడు. ఇందులో మూడు సిక్సర్లు, రెండు ఫోర్లు ఉన్నాయి. ఆ మ్యాచ్‌లో భారత్ ఏడు పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం విదితమే..




# ఐపీఎల్‌లో తొలిసారి కోచ్‌గా శ్రీలంక దిగ్గజం..

శ్రీలంక మాజీ ఆల్‌రౌండర్ చమిందా వాస్‌కు ఐపీఎల్‌లో తొలిసారి కోచింగ్ అవకాశం దక్కింది. 2027 ఐపీఎల్ సీజన్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ తమ ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా వాస్‌ను నియమించింది. దీంతో కొత్త కోచింగ్ బృందంలో ఆయన కీలక బాధ్యతలు చేపట్టనున్నారు. శ్రీలంక తరఫున అద్భుత రికార్డు కలిగిన వాస్.. టెస్టుల్లో 355 వికెట్లు, వన్డేల్లో 400 వికెట్లు పడగొట్టారు. ఢిల్లీ క్యాపిటల్స్ కొత్త హెడ్ కోచ్ సౌరవ్ గంగూలీ నేతృత్వంలోని కోచింగ్ బృందంలో వాస్ జాతకానున్నారు. ఇటీవలే యువరాజ్ సింగ్‌ను అసిస్టెంట్, బ్యాటింగ్ కోచ్‌గా ఢిల్లీ నియమించిన సంగతి తెలిసిందే.గత రెండు సీజన్లలో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ కోచ్‌గా పనిచేసిన మునాఫ్ పటేల్ స్థానంలో చమిందా వాస్ కీలక బాధ్యతలు స్వీకరించనున్నారు. 52 ఏళ్ల వాస్ గతంలో శ్రీలంక పురుషుల జట్టుకు మూడు విడతల్లో బౌలింగ్ కోచ్‌గా సేవలందించారు. వాస్ కోచింగ్ కెరీర్ న్యూజిలాండ్‌తో ప్రారంభమైంది. ఆ తర్వాత 2013 నుంచి 2015 వరకు శ్రీలంక జట్టుకు కోచ్‌గా పనిచేశారు. 2016 టీ20 ప్రపంచకప్ సమయంలో ఐర్లాండ్ బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఆ తర్వాత మరోసారి శ్రీలంక కోచింగ్ బృందంలో చేరారు. ఆటగాడిగా కూడా వాస్‌కు ఐపీఎల్ అనుభవం ఉంది. 2008 నుంచి 2010 వరకు డెక్కన్ ఛార్జర్స్ తరఫున ఆడిన ఆయన.. 13 మ్యాచ్‌ల్లో 18 వికెట్లు పడగొట్టారు. ఇప్పుడు తొలిసారి ఐపీఎల్‌లో కోచ్‌గా అడుగుపెట్టనున్న వాస్.. ఢిల్లీ క్యాపిటల్స్ పేస్ బౌలింగ్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెట్టనున్నారు.

# ఐదు వన్డేలు, ఇద్దరు కెప్టెన్లు..








న్యూజిలాండ్ టూర్‌కు వెళ్లే టీమిండియా జట్టు ఎంపికలో భారీ మార్పులే జరిగాయి. ఆ దేశంలో భారత జట్టు సుదీర్ఘంగా పర్యటించనుంది. ఈ చారిత్రక పర్యటనలో భాగంగా భారత జట్టు ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. అయితే.. భారత్ తాజాగా జట్లను ప్రకటించిన విషయం తెలిసిందే. టీమ్స్‌లో ఐదు వన్డేలకు ఇద్దరు కెప్టెన్లు ఉండటం గమార్హం. మరోవైపు.. టెస్టు జట్టులోకి పేసర్ ఆకాష్ దీప్, అన్షుల్ కాంబోజ్ మళ్లీ వచ్చారు. లోయర్ బ్యాక్‌లో స్ట్రెస్ ఫ్రాక్చర్ నుంచి కోలుకున్న ఆకాష్ దీప్ తిరిగి జట్టులోకి వచ్చాడు. 2025లో ఇంగ్లాండ్ టూర్‌లో అద్భుతంగా రాణించిన అతను, ఇప్పుడు మళ్లీ అవకాశం దక్కించుకున్నాడు. ఇక ఇంగ్లాండ్‌లో టెస్టు అరంగేట్రం చేసిన అన్షుల్ కాంబోజ్ కూడా జట్టులోకి వచ్చాడు. అయితే, గుర్నూర్ సింగ్ బ్రార్‌కు మాత్రం టెస్టు జట్టులో చోటు దక్కలేదు. వీరు కాకుండా వికెట్ కీపర్ రిషభ్ పంత్ కూడా టెస్టు స్క్వాడ్‌లో ఉన్నాడు కానీ, అతని ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావాల్సి ఉంది. ప్రస్తుతం ఎడమ పక్కటెముక గాయం నుంచి అతను కోలుకుంటున్నాడు.మరోవైపు బుమ్రా విషయంలో మేనేజ్మెంట్ కీలక నిర్ణయం తీసుకోనుంది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కేవలం టెస్టు సిరీస్‌లో మాత్రమే ఆడనున్నాడు. వచ్చే ఏడాది ప్రారంభంలో ఆస్ట్రేలియాతో భారత్‌లో ఐదు టెస్టుల సిరీస్ ఉండటంతో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. మోకాలి గాయం కారణంగా శ్రీలంకతో జరిగిన గత సిరీస్‌కు దూరమైన బుమ్రా, ఆ తర్వాత టీ20ల ద్వారా తిరిగి వచ్చి జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. త్వరలోనే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రిపోర్ట్ చేసి సుదీర్ఘ ఫార్మాట్ కోసం తన ఫిట్‌నెస్‌ను మరింత పెంచుకోనున్నాడు.ఇక, వన్డే సిరీస్‌కు సంబంధించి కెప్టెన్సీలోనూ మార్పులు చేశారు. తొలి మూడు వన్డేలకు శుభమన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఆ తర్వాత అతను టెస్టు క్రికెట్ ప్రిపరేషన్స్‌పై దృష్టి పెట్టనున్నాడు. దాంతో చివరి రెండు వన్డేలకు శ్రేయస్ అయ్యర్ జట్టును నడిపించనున్నాడు. కెఎల్ రాహుల్ కూడా మూడో వన్డే తర్వాత రెడ్ బాల్ క్రికెట్‌పై ఫోకస్ పెట్టనున్నాడు. 2025 డిసెంబర్ తర్వాత తొలిసారి తిలక్ వర్మ వన్డే జట్టులోకి రాగా, యువ వికెట్ కీపర్ బ్యాటర్ కుమార్ కుశాగ్ర తొలిసారిగా భారత జట్టులో స్థానం సంపాదించాడు. అయితే సీనియర్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాను మాత్రం వన్డే జట్టు నుంచి తప్పించారు.ఇదిలా ఉండగా.. న్యూజిలాండ్ పర్యటన అక్టోబర్ 22 నుంచి టీ20 మ్యాచ్‌లతో ప్రారంభం కానుంది. అక్టోబర్ 22, 24 తేదీల్లో క్రైస్ట్‌చర్చ్‌లో తొలి రెండు టీ20లు, అక్టోబర్ 27న వెల్లింగ్‌టన్‌లో మూడోది, అక్టోబర్ 30న ఆక్లాండ్‌లో నాలుగోది, నవంబర్ 1న హామిల్టన్‌లో ఐదో టీ20 జరుగుతాయి. ఆ తర్వాత నవంబర్ 4 నుంచి వన్డే సిరీస్ మొదలవుతుంది. తొలి వన్డే నవంబర్ 4న ఆక్లాండ్‌లో, రెండోది నవంబర్ 7న వెల్లింగ్‌టన్‌లో, మూడోది నవంబర్ 10న హామిల్టన్‌లో, అలాగే నాలుగు, ఐదు వన్డేలు నవంబర్ 13, 15 తేదీల్లో మౌంట్ మాంగనుయ్‌లో నిర్వహిస్తారు. ఇక చివరగా నవంబర్ 19 నుంచి టెస్టు మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. తొలి టెస్టు నవంబర్ 19 నుంచి వెల్లింగ్‌టన్‌లో, రెండో టెస్టు నవంబర్ 27 నుంచి క్రైస్ట్‌చర్చ్‌లో జరుగుతాయి.

**తొలి మూడు వన్డేలకు జట్టు:** శుభమన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కెఎల్ రాహుల్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, నమన్ ధీర్, అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్, రుతురాజ్ గైక్వాడ్, అర్షదీప్ సింగ్, ఇషాన్ కిషన్, మొహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్.

**చివరి రెండు వన్డేలకు జట్టు:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్ (వైస్ కెప్టెన్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, నమన్ ధీర్, ఆకిబ్ నబి, గుర్నూర్ బ్రార్, రుతురాజ్ గైక్వాడ్, అర్షదీప్ సింగ్, కుమార్ కుశాగ్ర, మొహమ్మద్ సిరాజ్, యశ్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్.

**టెస్టు జట్టు:** శుభమన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, అన్షుల్ కాంబోజ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్ దీప్, సాయి సుదర్శన్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, మొహమ్మద్ సిరాజ్.

# బిజినెస్

## భారత్‌కు భారీ ఊరట!



రష్యన్ ఆయిల్ పై టారిఫ్స్ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన వైఖరిని మార్చుకున్నారు. రష్యాపై ఆర్థిక ఒత్తిడిని పెంచేందుకు ఉద్దేశించిన కఠినమైన 'గ్రాహమ్ చట్టం' కింద విధించాలని అనుకున్న ఆంక్షలు, 100 శాతం టారిఫ్స్ నుంచి వెనక్కి తగ్గారు. అమెరికా జాతీయ ప్రయోజనాల రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు ట్రంప్. నవంబర్ 3న జరగనున్న మధ్యకాలిక ఎన్నికల నేపథ్యంలో దేశీయంగా ఇంధన ధరలను తగ్గించటం, రష్యా నుంచి అదనపు డీజిల్ సరఫరాలను పొందడమే లక్ష్యంగా ట్రంప్ ఈ ఎత్తుగడ వేశారు.రష్యా నుంచి అత్యధికంగా క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ కూడా ఒకటి. సెప్టెంబర్‌లో ఆమోదం పొందిన 'లిండ్సే ఓ. గ్రాహమ్ సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' ప్రకారం.. రష్యన్ ఆయిల్ కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు దిగుమతి సుంకాలు పడే ప్రమాదం ఉంది. ఇది భారత్-అమెరికా వాణిజ్య సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతుందనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే ట్రంప్ తాజా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా ఈ కఠినమైన సుంకాలు, ఆంక్షలను తాత్కాలికంగా మినహాయించడంతో భారత్‌కు భారీ ఊరట లభించింది. ప్రస్తుతానికి ఇండియా ఇంధన దిగుమతులను ఎలాంటి భయాలు లేకుండా కొనసాగించడానికి, వాణిజ్యపరమైన అనిశ్చితిని తగ్గించుకోవడానికి ట్రంప్ తాజా నిర్ణయం దోహదపడుతుంది. అంతర్జాతీయంగా చూస్తే.. ఈ నిర్ణయం ప్రపంచ ఇంధన మార్కెట్లో ఒడిదుడుకులను కొంతవరకు నియంత్రించగలదు. రష్యాపై పూర్తిగా ఆంక్షలు అమలులోకి వస్తే గ్లోబల్ మార్కెట్‌లో ఆయిల్ సరఫరా తగ్గి ధరలు విపరీతంగా పెరిగేవి. కానీ ట్రంప్ తీసుకున్న ఈ మినహాయింపు నిర్ణయం, రష్యాతో కుదుర్చుకున్న కొత్త డీజిల్ ఒప్పందాలు ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు అదుపులో ఉండటానికి సహాయపడతాయి. ముఖ్యంగా అమెరికాలో రవాణా, వ్యవసాయ రంగాలపై పడుతున్న ద్రవ్యోల్బణ భారాన్ని తగ్గించేందుకు ఇది ఉపయోగపడుతుందని ట్రంప్ భావిస్తున్నారు. మొత్తానికి రష్యాతో రాజకీయ వైరం కొనసాగిస్తూనే.. అమెరికా ఆర్థిక అవసరాల కోసం ట్రంప్ వెనకడుగు వేయటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# బంగారం ధరలు మళ్లీ కిందకే..



అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. దేశీయంగా కూడా బంగారం ధరలు తగ్గుదలను నమోదు చేస్తున్నాయి. శనివారం కూడా బంగారం ధరలు మరికొంచెం తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,47,430గా ఉంది . ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,35,140గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా స్వల్ప తగ్గుదల నమోదు చేశాయి. కిలోకు వంద రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ.2,29,900గా ఉంది.



# నవంబర్ 1 నుంచి స్క్రీన్‌పై కాలర్ ఐడీ

తెలియని నంబర్లతో వేధించే స్పామ్, మోసపూరిత కాల్స్‌కు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. టెలికమ్యూనికేషన్స్ విభాగం (డీఓటీ) జారీ చేసిన తాజా ఆదేశాల ప్రకారం.. నవంబర్ 1 నుండి దేశంలోని అన్ని టెలికాం కంపెనీలు 4జీ, 5జీ నెట్‌వర్క్‌లలో 'కాలింగ్ నేమ్ ప్రజెంటేషన్' సేవలను తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుంది. ట్రాయ్ సిఫార్సులతో ఈ అధికారిక, వెరిఫై చేసిన కాలర్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ ద్వారా.. ఎవరికైనా ఫోన్ కాల్ రాగానే, వారి ఫోన్ స్క్రీన్‌పై నంబర్‌తో పాటు ఆ వ్యక్తి లేదా సంస్థ అసలు పేరు స్పష్టంగా కనిపిస్తుంది. ఒకవేళ కాంటాక్ట్‌లో నంబర్ సేవ్ చేయకపోయినా, టెలికాం ఆపరేటర్ల డేటాబేస్ లేదా జీఎస్‌టీ (జీఎస్టీ), ట్రేడ్‌మార్క్ రికార్డుల ఆధారంగా రిజిస్టర్డ్ పేరు ఆటోమేటిక్‌గా డిస్‌ప్లే అవుతుంది. అంతర్జాతీయ కాల్స్ వస్తే స్క్రీన్‌పై 'అంతర్జాతీయ కాల్' అని ప్రత్యేకంగా సూచిస్తుంది. కాల్ ముగిసిన వెంటనే ప్రైవసీని కాపాడేలా 'సెక్యూరిటీ-బై-డిజైన్' టెక్నాలజీ ద్వారా నంబర్ వివరాలు మాయమవుతాయి. తద్వారా దేశంలోని మొబైల్ యూజర్లకు ఫేక్ కాల్స్ బెడద తప్పుతుందని నిపుణులు భావిస్తున్నారు.



# గ్యాస్ సిలిండర్ ధరలు

ఈ నెల ఒకటో తేదీన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై ఒక్కసారిగా రూ.62.50 పెంచాయి. ఈ పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.2,837.50కి చేరుకుంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లో రూ.3,065కి, విజయవాడలో 2,932.50, విశాఖపట్నంలో రూ.2,827.50కి ధరలు చేరాయి.ఇదిలా ఉండగా.. గృహ వినియోగ ఎల్‌పీజీ ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ఈ రోజు(అక్టోబర్ 17) రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. తెలంగాణలోని హైదరాబాద్ నగరంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.994.00గా, వరంగల్‌లో రూ.1013.00గా ఉంది. ఇక, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలైన విశాఖపట్నంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.950.00గా, విజయవాడలో రూ.966.50, గుంటూరులో రూ.966.50గా ఉంది.

# రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు




గత నెల పెట్రోల్ డీజిల్ ధరలతో పోల్చితే అక్టోబర్‌లో ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. ఈ తరుణంలో హైదరాబాద్‌లో ప్రస్తుతం పెట్రోల్ ధర లీటరుకు రూ.116.15గా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఈ రోజు(శనివారం) పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

**హైదరాబాద్**
లీటర్ పెట్రోల్ ధర: రూ.116.15
లీటర్ డీజిల్ ధర:రూ.104.23
కిలో సీఎన్‌జీ ధర:రూ.112.00

**వరంగల్**
లీటర్ పెట్రోల్ ధర: రూ.115.62
లీటర్ డీజిల్ ధర రూ.103.74
కిలో సీఎన్‌జీ ధర:రూ.112.00

**విశాఖపట్నం**
లీటర్ పెట్రోల్ ధర: రూ.116.39
లీటర్ డీజిల్ ధర రూ.104.11
కిలో సీఎన్‌జీ ధర:రూ.99.80

**విజయవాడ**
లీటర్ పెట్రోల్ ధర: రూ.117.25
లీటర్ డీజిల్ ధర రూ.104.96
కిలో సీఎన్‌జీ ధర:రూ.103.00



# నా జీవితంలో అసలైన విజయం

నేచురల్ బ్యూటీ సాయి పల్లవి త్వరలోనే 'రామాయణ' వంటి అత్యంత భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రం రాబోయే దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. ఈ క్రమంలో సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సాయి పల్లవి తాజాగా 'జయమ్ము నిశ్చయమ్మురా సీజన్-2' టాక్ షోలో పాల్గొని, తన కెరీర్ తొలినాళ్లలోని చేదు తీపి అనుభవాలను పంచుకున్నారు. నటుడు జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ షోలో.. 'మీ జీవితంలో జయమ్ము నిశ్చ-యమ్మురా అనిపించిన ప్రత్యేక సంఘటన ఏది?' అని సాయి పల్లవిని ప్రశ్నించారు.దానికి ఆమె రియాక్ట్ అవుతూ.. తన డాన్స్ కెరీర్ ప్రారంభంలో ఒక ప్రముఖ డాన్స్ రియాలిటీ షో వేదికపై ఓడిపోయానని, కానీ సరిగ్గా అదే స్టేజ్‌పై కొన్నాళ్ల తర్వాత ప్రభుదేవా మాస్టర్ కొరియోగ్రఫీలో తాను 'రౌడీ బేబీ' పాటకు డాన్స్ చేయడం జీవితంలో మర్చిపోలేని మలుపు అని చెప్పారు. ఓటమి ఎదురైన చోటే తనను తాను నిరూపించుకుని, అంతటి గొప్ప స్థాయికి చేరుకోవడాన్ని తన నిజమైన విజయంగా భావిస్తానని ఆమె తెలిపారు. కేవలం అదృష్టం ఉంటేనే విజయం వస్తుందంటే తాను నమ్మనని సాయి పల్లవి స్పష్టం చేశారు. మనం పడే కష్టమే మనల్ని సరైన స్థానంలో నిలబెడుతుందని, కష్టపడి పనిచేస్తే సక్సెస్ అనేది వెతుక్కుంటూ ఆటోమేటిక్‌గా వస్తుందని చెప్పారు. తన జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాలే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని సాయి పల్లవి వెల్లడించారు.



# నన్ను నిలబెట్టింది ఇక్కడి ప్రేక్షకులే

సినిమా మొదలుపెట్టే ముందే 'పాన్ ఇండియా' అని ఆలోచించడం వల్ల వచ్చే అనవసరపు తలనొప్పులను అక్కినేని నాగార్జున చాలా ప్రాక్టికల్‌గా ఎండగట్టారు. ఇటీవల చిన్న సినిమా మొదలు పెద్ద ప్రాజెక్ట్ వరకు ప్రతి ఒక్కరూ పాన్ ఇండియా అంటూ హడావుడి చేస్తుండటంపై నాగ్ తనదైన శైలిలో చురకలు అంటించారు. సినిమా తీసేటప్పుడే పాన్ ఇండియా అని మైండ్‌లో పెట్టుకుంటే మొత్తం గందరగోళం మొదలవుతుందని నాగార్జున విశ్లేషించారు. "మనం మొదట్లోనే అలా అనుకుంటే ఏ భాష యాక్టర్లను పెట్టుకోవాలి? వేరే వాళ్లను తెచ్చి ఇరికించాలా? డైలాగులు ఎలా రాయాలి? ఈ డైలాగ్ ఆ భాషోళ్లకు నచ్చుతుందా? మన కల్చర్, మనం కట్టే లుంగీలు వాళ్లకు ఎక్కుతాయా? అంటూ పనికిమాలిన నాన్సెన్స్ అంతా బుర్రలోకి వచ్చేస్తుంది" అంటూ నాగ్ అసలు విషయాన్ని బయటపెట్టారు.ఇతర రాష్ట్రాల ప్రేక్షకుల అభిరుచుల కోసం కథలోని సహజత్వాన్ని మార్చడం సరికాదని ఆయన తేల్చిచె

ప్పారు. "తెలుగు సినిమాని తెలుగు సినిమా లాగే తీయాలి.. ఆ తర్వాతే మిగతావన్నీ" అంటూ సూటిగా స్పష్టం చేశారు. మన నేటివిటీని కాపాడుకుంటూ మంచి సినిమా తీస్తే, దాన్ని దేశవ్యాప్తంగా ప్రేక్షకులే ఆదరిస్తారనే విషయాన్ని నాగార్జున గుర్తుచేశారు. కథను వదిలేసి అనవసరపు కమర్షియల్ లెక్కలు వేసుకునే మేకర్స్‌కు నాగ్ మాటలు కచ్చితంగా ఒక రియాలిటీ చెక్ లాంటివని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# రణబాలి కథ చెప్పడానికే చేశాం...

'సినిమాలు హిట్ అవ్వడం, బిజినెస్ పరంగా ఆడటం మా అందరికీ చాలా అవసరం. కానీ 'రణబాలి' విషయానికి వస్తే.. కేవలం ఒక హిట్టు కొట్టాలని లేదా ఏదో బాక్సాఫీస్ కలెక్షన్లు చూపించాలని మేము ఈ సినిమా చేయలేదు. ఇది మన ప్రజలకు చెప్పాల్సిన ఎంతో ముఖ్యమైన కథ. రాహుల్ దీన్ని ఎన్నో లేయర్లతో అద్భుతంగా తెరకెక్కించాడు. టీజర్, ట్రైలర్ చూసిన దానికంటే సినిమాలో ఎన్నో కొత్త అంశాలున్నాయి. అందుకే ప్రతి ఒక్కరూ కొన్ని ప్రత్యేక సన్నివేశాల గురించి చాలా గట్టిగా మాట్లాడుకుంటున్నారు" అని స్పష్టం చేశారు.నిన్న రాత్రి తామంతా కలిసి సినిమా చూసిన అనుభవాన్ని పంచుకుంటూ.. "ప్రపంచం ఏమనుకుంటుందో అనే లెక్కలు లేకుండా మా టీమ్ మొత్తం 25 మందిమి కలిసి నిన్న సినిమా చూశాం. సినిమా చూసిన వెంటనే నాకు అనిపించింది ఒక్కటే.. ఈ ఏడాది వచ్చిన బెస్ట్ తెలుగు చిత్రాల్లో 'రణబాలి' కచ్చితంగా ఒకటిగా నిలుస్తుంది. నేను ప్రీ-రిలీజ్ ఈవెంట్ లోనే చెప్పా.. తెలుగు సినిమా గర్వపడేలా ఇది ఉంటుందని. ఇది నా 14వ సినిమా. భవిష్యత్తులో నేను 25, 30 సినిమాలు చేసినా కూడా.. ఎప్పటికీ గుర్తుండిపోయే కొన్ని ప్రత్యేక చిత్రాలు ఉంటాయి. అందులో 'రణబాలి' నా ఫిల్మోగ్రఫీలో, అలాగే తెలుగు సినిమా చరిత్రలో ఒక మైలురాయిలా నిలిచిపోతుంది" అని ధీమా వ్యక్తం చేశారు. సినిమా చూసిన తర్వాత తన మిత్రులు, సినీ ప్రముఖుల నుంచి వస్తున్న రియాక్షన్ గురించి విజయ్ మాట్లాడుతూ.. చాలా మంది ఫోన్ చేసి ఎమోషనల్‌గా మాట్లాడారన్నారు. రేపటి నుంచి మేమంతా నేరుగా ప్రేక్షకుల వద్దకు వస్తున్నాం. విజయవాడ, గుంటూరు, వైజాగ్ లతో పాటు సింగనమల కథ జరిగిన అనంతపురం కూడా వెళ్లి మీ అందరితో కలిసి విజయాన్ని సెలబ్రేట్ చేసుకుంటాం అని విజయ్ ప్రకటించారు. బాక్సాఫీస్ నెంబర్ల గోల కంటే కథలోని నిజాయితీనే ముఖ్యమని రౌడీ హీరో కుండబద్దలు కొట్టిన తీరు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది.







# డబ్బులు ముఖ్యం కాదు..

ఓ షోలో పాల్గొన్న యామీ గౌతమ్ అసలు నిజం బయటపెట్టారు. ఆ రోల్ కోసం తాను భారీ చెక్కు తీసుకున్నానని చాలామంది అనుకున్నారని, కానీ ప్రతి విషయాన్ని డబ్బుతో ముడిపెట్టలేమని స్పష్టం చేశారు. తన భర్త ఆదిత్య స్వయంగా తన దగ్గరకు వచ్చి 'సినిమాలో గుడ్ లక్ కోసం నువ్వు తప్పకుండా ఆ ఫ్రేమ్‌లో ఉండాలి' అని కోరిన విధానం తనను ఎంతగానో కదిలించిందని చెప్పారు. దేశంలోనే అత్యుత్తమ దర్శకులలో ఒకరైన తన భర్త చేతిలో డైరెక్ట్ చేయించుకోవడం, ఆ అరుదైన అనుభూతిని పొందడమే తాను అందుకున్న అసలైన పారితోషికం అని యామి ఎమోషనల్ అయ్యారు. డబ్బు కంటే భర్తతో పంచుకున్న ఆ సృజనాత్మక సంతృప్తే తనకు చాలా గొప్పదని చెప్పుకొచ్చారు.

# నాకో గొప్ప అనుభవం



ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనురాగ్ కశ్యప్ చిరంజీవితో కలిసి పనిచేసిన అనుభవం గురించి పంచుకున్నారు. చిరంజీవి నిజంగా అద్భుతమని, ఆయనలో ఉన్న సిన్సియారిటీ, ఫోకస్ చూస్తుంటే ఎంతో ఇన్‌స్పైరింగ్ అనిపిస్తుందని అనురాగ్ తెలిపారు.తన కెరీర్‌లో ఎన్నో బ్లాక్‌బస్టర్స్ ఇచ్చినప్పటికీ, ఏదో ఇప్పుడే ఫస్ట్ సినిమా చేస్తున్నానన్నంత ఉత్సాహం ఆయనలో కనిపిస్తుందని ప్రశంసించారు. అలాగే తెలుగు ప్రేక్షకుల నాడిని పట్టుకోవడంలో చిరంజీవికి సాటిలేరని అనురాగ్ అన్నారు. ఆడియన్స్‌కి ఏది నచ్చుతుందనే దానిపై ఆయనకు ఉన్న క్లారిటీ వేరే లెవెల్‌లో ఉంటుందని చెప్పారు. టాలీవుడ్ ఇండస్ట్రీ ఒక కొత్త ప్రపంచమని, ఇలాంటి ఒక పవర్-ప్యాక్డ్ మెయిన్‌స్ట్రీమ్ సినిమాలో నటించడం తన కెరీర్‌లోనే ఒక గ్రేట్ లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్ అని అనురాగ్ కశ్యప్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# భారతీయ సినిమాను గౌరవించండి



బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ'. ప్రముఖ నిర్మాత నమిత్ మల్హోత్రా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ విజువల్ వండర్‌లో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా కేజీఎఫ్ స్టార్ యష్, హనుమంతుడిగా సన్నీ డియోల్, శూ-ర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్, మండోదరిగా కాజల్ అగర్వాల్ నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న యష్.. సినిమాపై సోషల్ మీడియాలో వస్తున్న నెగెటివిటీకి, విమర్శలకు తనదైన శైలిలో గట్టి సమాధానమిచ్చారు. సుమారు నాలుగు వేల కోట్ల భారీ విజన్‌తో తెరకెక్కుతున్న ఇలాంటి గొప్ప ప్రాజెక్ట్‌కు అందరి మద్దతు, మంచి ఆశయం అవసరమని, అంతేకానీ సోషల్ మీడియాలో నిత్యం ఎగతాళి చేయడం సరికాదని ఆయన అన్నారు.సినిమాపై నిర్మాణాత్మక విమర్శలు ఉండవచ్చు కానీ, అసలు మూవీని చూడకుండానే ముందుగానే దాన్ని తప్పుబట్టడం సమంజసం కాదని స్పష్టం చేశారు. భారతీయ సినిమాను గౌరవించాలని యష్ పిలుపునిచ్చారు. ఇక తన గత చిత్రం 'టాక్సిక్' గురించి మాట్లాడుతూ.. అన్ని అడ్డంకులను ఎదుర్కొని ప్రేక్షకులు ఆ సినిమాను ఎన్నోసార్లు చూసి, భారీ కలెక్షన్లతో దానిని ఎంతగానో ప్రేమించారని, ఆదరించారని గుర్తుచేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. తను కూడా ఒక నిర్మాతగా వ్యవహరిస్తున్నానని, ఈ 'రామాయణం' కూడా కర్ణాటక ఉత్పత్తి అని గర్వంగా చెబుతున్నానని యష్ పేర్కొన్నారు.




# ఆకట్టుకుంటోన్న క్యూట్ పోస్టర్

ఇటీవల 'చెన్నై లవ్ స్టోరీ'తో ప్రేక్షకులను అలరించిన యంగ్ హీరో కిరణ్ అబ్బవరం.. ఇప్పటికే నటుడిగా, నిర్మాతగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇప్పుడు తన కెరీర్‌లో ఒక పెద్ద అడుగు వేయ-బోతున్నారు. ఈ మేరకు మొదటిసారిగా మెగాఫోన్ పట్టి దర్శకత్వం వహించేందుకు సిద్ధమయ్యారు. 'రియాలిటీ' అనే డిఫరెంట్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాతో ఆయన డైరెక్టర్‌గా పరిచయం కానుండటంతో సినిమాపై అప్పుడే మంచి బజ్ ఏర్పడింది. గ్రామీణ నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో శరత్‌కుమార్, సాయికుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక దేవిక భట్ హీరోయిన్‌గా నటిస్తుందంటూ వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా క్లారిటీ ఇస్తూ క్యూట్ పోస్టర్ షేర్ చేశారు మేకర్స్. "రియాలిటీ'తో ఇదే అసలైన వాస్తవం.. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి అందమైన దేవిక భట్‌కు స్వాగతం. డిసెంబర్ 25న వీరు ఇద్దరూ వెండితెరపై మెరిసి, ఈ క్రిస్మస్‌ను మరింత వినోదాత్మకంగా మార్చబోతున్నారు' అంటూ పంచుకున్న పోస్టర్ నెట్టింట క్యూట్ క్యూట్‌గా వైరల్ అవుతున్నది.




# ఆశలన్నీ ఆ సినిమాలపైనే!

ఒకప్పుడు దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనదైన నటనతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న కీర్తి సురేష్.. ఇప్పుడు వరుస విజయాల కోసం ఎదురుచూస్తోంది. బాలీవుడ్‌లో 'బేబీ జాన్'తో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చినా.. ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఫలితాన్ని అందుకోలేకపోయింది. మరోవైపు నాని నటించిన 'ది పారడైజ్'లో స్పెషల్ సాంగ్‌తో సందడి చేసినా.. సినిమా ఫలితం అనుకూలంగా లేకపోవడంతో కీర్తికి ఆశించిన గుర్తింపు దక్కలేదు. గ్లామర్ పాత్రలైనా, ప్రత్యేక పాత్రలైనా.. కెరీర్‌కు నిజమైన బలం మాత్రం విజయవంతమైన సినిమాలే. ఈ నేపథ్యంలో తనకు వస్తున్న అవకాశాలను బాక్సాఫీస్ విజయాలుగా మార్చుకోవడం కీర్తికి కీలకంగా మారింది.ప్రస్తుతం కీర్తి సురేష్ ఆశలన్నీ కొత్త కోర్ట్‌రూమ్ డ్రామా 'సత్యవాన్ సావిత్రి'పైనే ఉన్నాయి. ఇటీవల విడుదలైన టీజర్‌లో కోర్టులో తడబడే ఇంగ్లీష్, అమా-యకమైన వాదనలతో ఆమె పాత్ర నవ్వులు పూయిస్తోంది. దీంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. నవంబర్ 20న విడుదల కానున్న ఈ సినిమా కీర్తి కెరీర్‌కు కీలకంగా మారనుంది. కథ, పాత్రలోని వైవిధ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంటే ఆమెకు మరో విజయాన్ని అందించే అవకాశం ఉంది. తెలుగులోనూ కీర్తి కీలకమైన ప్రాజెక్టులపై ఆశలు పెట్టుకుంది. విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న 'రౌడీ జనార్ధన'లో ఆమె కథానాయికగా కనిపించనుంది. గ్రామీణ నేపథ్యంలో, మాస్ లుక్, తూర్పు గోదావరి యాసతో రూపొందుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. విజయ్‌తో కీర్తి జోడీ ఎలా ఉండబోతోందన్నది కూడా చర్చనీయాంశంగా మారింది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**